www.hamsakalam.com
PRGI: TGTEL/26/A3129
సంచలన తెలుగు దినపత్రిక
# హంస కలం వార్త
HAMSA KALAM VARTA
చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి

TELANGANA RISING
CURE - PURE - RARE



EDITOR :VADLA MADHUSUDHAN CHARY   MEDCHAL /MALKAJGIRI   VOLUME:1   ISSUE:16   SUNDAY ,MAY 24 ,2026   PAGES:8   COST: 4 /-

ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి   మేడ్చల్ /మల్కాజిగిరి   సంపుటి : 1   సంచిక : 16   ఆదివారం 24 మే 2026   పేజీలు :8   వెల: 4/-

## హరీష్ రావువి పగటి కలలు మండిపడ్డ మంత్రి శ్రీధర్ బాబు




మే 23 హంసకలం వార్త

ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు బాధ్యతా రాహిత్యంగా మాట్లాడుతున్నారని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. ఇది బ్లాక్ మెయిల్ రాజకీయమని మండిపడ్డారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలా వద్దా ఆయన చెప్పాలన్నారు. 'ఇలా చేస్తే పెట్టుబడులు రావు. పక్క రాష్ట్రాలకు వెళ్తాయి. ఫ్యూచర్ సిటీలో కాలుష్యకారక పరిశ్రమలు ఉండవు. దాన్ని రద్దు చేస్తామనడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని - మిగతా2లో

## యాదగిరిగుట్టలో సిఎం పర్యటన

### రూ.43.80 కోట్లతో వేద పాఠశాలకు భూమి పూజ



మే 23 హంసకలం వార్త

యాదగిరిగుట్టలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా రూ.100 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. శనివారం ఉదయం యాదగిరిగుట్టకు చేరుకున్న సీఎం రేవంత్ శ్రీలక్ష్మీనర్సింహ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం రూ.43.80 కోట్లతో నిర్మించనున్న వేద పాఠశాలకు రేవంత్ శంకుస్థాపన చేశారు. కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతితో కలిసి వేదపాఠశాలకు భూమిపూజ చేశారు. అనంతరం రూ.9.87 కోట్లతో కొండపై స్వామివారి నిత్య కల్యాణ మండపం నిర్మాణానికి, రూ.1.41 కోట్లతో వైకుంఠ ద్వారం నుంచి కొండ పైకి వెళ్లే మెట్ల మార్గం పై కప్పు నిర్మాణానికి, - మిగతా2లో

## కుమారుడు ట్రంప్ జూనియర్ వివాహం



మే 23 హంసకలం వార్త

ఇరాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. త్వరలో జరగనున్న తన పెద్ద కుమారుడు డొనాల్డ్ ట్రంప్ జూనియర్ వివాహానికి తాను హాజరుకాక పోవచ్చని పేర్కొన్నారు. ఆ వేడుకకు హాజరైనా హాజరుకాకపోయినా తప్పుడు వార్తలతో తనను చంపేస్తారని చమత్కరించారు. అందుకే వివాహానికి హాజరయ్యేందుకు ప్రయత్నిస్తానని అయితే ప్రస్తుత అంతర్జాతీయ పరిణామాలు, భద్రతాపరమైన ఆందోళనల - మిగతా2లో

## పశ్చిమాసియాలో సడలని ఉద్రిక్త పరిస్థితులు



మే 23 హంసకలం వార్త

పశ్చిమాసియాలో పరిస్థితులు ఎప్పటికప్పుడు మారిపోతున్నాయి. ఓవైపు చర్చలు కొనసాగుతుండగానే.. ఇరాన్‌పై మరోసారి దాడికి దిగేందుకు అమెరికా సన్నద్ధమవుతుందంటూ వార్తలు వెలువడ్డాయి. ఈ క్రమంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్ తన గగనతలాన్ని మూసివేసింది. దేశంలోని పశ్చిమ ప్రాంతం వైపున్న గగనతలాన్ని మూసివేస్తున్నట్లు ఇరాన్ పౌర విమానయాన సంస్థ విమానయాన సిబ్బందికి నోటమ్ జారీ చేసింది.

- మిగతా2లో

## తెలంగాణ ఎండల తీవ్రత పై ప్రభుత్వం అలర్ట్



మే 23 హంసకలం వార్త

రాష్ట్రవ్యాప్తంగా హీట్ వేవ్ పై హై అలర్ట్ ప్రకటించినట్లు తెలంగాణ రెవెన్యూ, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. తీవ్ర ఉష్ణోగ్రతల పై మంత్రి పొంగులేటి సచివాలయంలో శనివారం అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై మంత్రి దిశానిర్దేశం చేశారు. వడగాల్పులతో 7 జిల్లాల్లో 16 మంది మృతి చెందారని తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల - మిగతా2లో

## ప్రధాని మోడీతో రామ్మోహన్ కుటుంబం భేటీ



మే 23 హంసకలం వార్త

కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు శనివారం కుటుంబంతో కలిసి ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి తల్లి ప్రధాన మంత్రికి మొక్కను బహుకరించారు. - మిగతా2లో

## ధాన్యం కొనుగోళ్లలో పూర్తి నిర్లక్ష్యం



మే 23 హంసకలం వార్త

పంట కొనుగోలులో దారుణంగా విఫలమైన ప్రభుత్వం అన్నదాతల ఆత్మహత్యలపై తప్పుడు లెక్కలు చెప్తున్నదని మాజీమంత్రి వేముల ప్రశాంతరెడ్డి మండిపడ్డారు. ధాన్యం ఎక్కడా సక్రమంగా కొనగడం లేదన్నారు. నిజామాబాద్‌కు వస్తే రైతులు పడుతున్న అగచాట్లను చూపిస్తానని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో చనిపోయిన రైతులు పది మందిపైనే ఉన్నారని, - మిగతా2లో

## యువత ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి




మే 23 హంసకలం వార్త

దేశవ్యాప్తంగా 47 ప్రాంతాల్లో జరిగిన రోజ్‌గార్ మేళాలో 51 వేల మందికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. యువత స్వయం సమృద్ధి సాధించి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. శనివారం నాడు బోయిగూడలోని రైల్ కళారంగ్‌లో జరిగిన 19వ రోజ్‌గార్ మేళాలో కేంద్ర మంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈరోజు 220 మంది కొత్తగా ఉద్యోగాల్లో చేరుతున్నారన్నారు. 2022లో - మిగతా2లో

## ఎపికి ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యం



మే 23 హంసకలం వార్త

ఆంధప్రదేశ్‌కు ప్రత్యేక హోదాపై తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అయితేనే ఏపీకి ప్రత్యేక హోదా వస్తుందని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కోసమైనా రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలని ఏపీ ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఆలోచన చేయాలని.. ఓటు ఎవరికో వేసి దేవుడిని ఏదో అడిగితే ఎవరూ ఏం - మిగతా2లో

# పశ్చిమాసియాలో సడలని ఉద్రిక్త పరిస్థితులు

-మొదటిపేజీ తరువాయి

ఈ నెల 25 వరకు అన్ని విమానాల రాకపోకలను నిలిపివేస్తున్నట్లు తెలిపింది. ఈ నోటమ్ జారీ చేసే సమయంలో ఖతార్ ప్రభుత్వానికి చెందిన ఓ వీఐపీ విమానం ఇరాన్ గగనతలాన్ని దాటింది. ఆ విమానం శాంతి ఒప్పందానికి సంబంధించిన చర్చల కోసం టెహ్రాన్‌కు వచ్చిన ఖతార్ ప్రతినిధి బృందానికి చెందినదిగా తెలుస్తోంది. ఇక, అమెరికా– ఇరాన్ మధ్య చర్చలు తుది దశకు చేరుకున్నాయని, ఒప్పందానికి సంబంధించిన చాలా అంశాల్లో ఇరుదేశాల మధ్య సయోధ్య కుదిరినట్లు తెలుస్తోంది. దీంతో ఏ క్షణమైనా ఒప్పంద ప్రకటన వెలువడే అవకాశముంది. అదే సమయంలో ఈ దౌత్య ప్రయత్నాలు చివరి నిమిషంలో విఫలమైతే.. టెహ్రాన్‌పై మళ్లీ దాడులు చేసే విషయాన్ని అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో ఇరాన్ కూడా తన గగనతలాన్ని మూసివేయడంతో.. పశ్చిమాసియాలో ఏ క్షణాన ఏం జరుగుతుందోననే భయాందోళనలు నెలకొన్నాయి. అమెరికా మరోసారి దాడులకు సిద్ధం అవుతోందన్న వార్తల నేపథ్యంలో ఇరాన్ ఇలా అప్రమత్తమైంది. ఈ పరిణామంతో గల్ఫ్‌లో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. యూఎస్ మరోసారి యుద్ధాన్ని ప్రారంభించిన పక్షంలో దీటుగా ఎదుర్కొనేందుకు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్, ఇతర సాయుధ దళాలు సిద్ధమవుతున్నట్టు ఇరాన్ వార్తా సంస్థ తస్నిమ్ ఒక కథనాన్ని ప్రచురించింది. అమెరికా ఆస్తులకు నష్టం కలిగేలా, ప్రయోజనాలు దెబ్బతినేలా దాడులకు ప్రణాళికలను ఇరాన్ మిలిటరీ సిద్ధం చేసినట్టు సమాచారం. ఈ వారాంతాన్ని న్యూజెర్సీలో గడపాల్సిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చివరి నిమిషంలో తన ప్లాన్స్‌ను అకస్మాత్తుగా రద్దు చేసుకుని రాజధాని వాషింగ్టన్‌కు తిరిగొచ్చారు. దీంతో, పశ్చిమాసియాలో మళ్లీ ఘర్షణలు మొదలవుతాయన్న వార్తలు మీడియాలో వెలువడ్డాయి. ఈ వారాంతంలో మెమోరియల్ డే వేడుకల్లో పాల్గొనాల్సిన అమెరికా నిఘా సంస్థల సీనియర్ అధికారులు కూడా తమ ప్రణాళికలను రద్దు చేసుకుని వాషింగ్టన్‌కు తిరిగొచ్చేశారు. రాబోయే 24 గంటల్లో దౌత్యపరమైన పురోగతి లేని పక్షంలో దాడులు మొదలుపెట్టేందుకు ట్రంప్ కూడా సుముఖంగానే ఉన్నట్టు స్థానిక మీడియాలో కథనాలు వెలువడ్డాయి. పరిస్థితులు అంతకంతకూ ఉద్రిక్తంగా మారుతున్నా తెరవెనుక దౌత్యమార్గాల్లో ప్రయత్నాలు ముమ్మర స్థాయిలో జరుగుతున్నట్టు కూడా తెలుస్తోంది. చర్చల్లో కొంత పురోగతి కనిపించిందని విశ్వసనీయ వర్గాలు చెప్పినట్టు తస్నిమ్ వార్తా సంస్థ పేర్కొంది.

# తెలంగాణ ఎండల తీవ్రత పై ప్రభుత్వం అలర్ట్

-మొదటిపేజీ తరువాయి

ఎక్స్‌గ్రేషియా ఇస్తున్నట్లు ప్రకటించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో నష్టపరిహారం ఇస్తున్నామని స్పష్టం చేశారు. వచ్చే మూడు రోజులు మరింత తీవ్రంగా హీట్ వేవ్ ఉండనుందని తెలిపారు. జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని మార్గనిర్దేశర చేశారు. ప్రజల ప్రాణ రక్షణెళి తమ ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని తెలిపారు. వడగాల్పులతో ఒక్క ప్రాణం కూడా కోల్పోకూడదని చెప్పుకొచ్చారు. ఎండ తీవ్రతపై ప్రజలకు గంట గంటకు హెచ్చరికలు జారీ చేశామని మంత్రి పొంగులేటి తెలిపారు. ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ప్రజలు బయటకు రావొద్దని సూచించారు. వృద్ధులు, గర్భిణులు, చిన్నారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. వ్యవసాయ, భవన నిర్మాణ కార్మికులు ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టాలని నిర్దేశిరచారు. హీట్‌వేవ్‌పై గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఎండదెబ్బకు గురైన వ్యక్తులకు ఆయా ఆస్పత్రులు అత్యవసర చికిత్స అందించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఇదిలావుంటే తెలంగాణలో భానుడి భగభగలు తీవ్రరూపం దాల్చాయి. రాష్ట్రవ్యాప్తంగా ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతుండగా, 18కు పైగా జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 46 డిగ్రీల సెల్సియస్‌ను దాటాయి. పరిస్థితి తీవ్రంగా మారడంతో అధికారులు 18 జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. హైదరాబాద్ లోనూ ఉష్ణోగ్రతలు భారీగా పెరిగి 43 డిగ్రీలకుపైగా నమోదయ్యాయి. రాష్ట్రంలోని ఉత్తర, తూర్పు జిల్లాలు తీవ్ర వడగాలుల ప్రభావానికి గురవుతున్నాయి. వడదెబ్బ ప్రభావం ఆందోళనకరంగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా వడదెబ్బ కారణంగా 34 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో ప్రజలు అత్యవసరం అయితే తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా అలసటగా ఉంటుంది, గాలిలో తేమ ఎక్కువగా ఉండటం, వేడిగా ఉన్నప్పుడు ఎక్కువగా అలసిపోయినట్లు అనిపిస్తుంది. కండరాల నొప్పి ఉంటుంది. హీట్ ఇంజురీలో శరీర భాగాలు దెబ్బతినే అవకాశం ఉంది. కిడ్నీ, గుండె సమస్యలు వచ్చే అవకాశం ఉంది. హీట్ స్ట్రోక్ తీవ్రమైన సమస్య.. దీనిలో శరీర భాగాలు తీవ్రంగా దెబ్బతింటాయి. దీని కారణంగా మెదడు పనితీరు దెబ్బతింటుంది. స్ట్రోక్ సంభవించవచ్చు. దీన్ని నిర్లక్ష్యం చేస్తే.. కోమాలోకి వెళ్లే ప్రమాదం ఉంది. ఈ వడదెబ్బ నుంచి తప్పించుకోవాలంటే.. శరీరాన్ని ఎప్పుడూ హైడ్రేట్‌గా ఉంచుకోవాలి. ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. మధ్యాహ్నం పూట బయటకు వెళ్లకపోవడం మంచిది. షుగర్, బీపీ పేషెంట్లు మెడికేషన్ సక్రమంగా తీసుకోవాలి. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 వరకు బయట తిరగకపోవడమే మంచిది. అత్యవసర పరిస్థితిలో వెళ్లాల్సి వస్తే.. తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

# యువత ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి

-మొదటిపేజీ తరువాయి

ఇప్పటివరకు 12.5 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించామని వెల్లడించారు. ఇది కేవలం ఉద్యోగాల కార్యక్రమం కాదని, యువత భవిష్యత్తు కోసం మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన పెద్ద మిషన్ అని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రైవేట్ కంపెనీల్లో కూడా కోట్ల సంఖ్యలో ఉద్యోగాలు వస్తున్నాయని అన్నారు. స్టార్టప్స్, యూనికార్న్ వల్ల యువత ఉద్యోగాలు అడిగే స్థాయి నుంచి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి వచ్చిందని కేంద్రమంత్రి అన్నారు. రోడ్లు, ఎయిర్‌పోర్టులు, రైల్వేలు, మెట్రోలు, ఇండస్ట్రియల్ కారిడార్లు వంటి ప్రాజెక్టులతో భారీగా ఉపాధి పెరుగుతోందన్నారు. దేశంలో ప్రతి సంవత్సరం రూ.12 లక్షల కోట్ల ఇన్‌ఫ్రా పనులు జరుగుతున్నాయని వివరించారు. ప్రతి లక్ష కోట్ల పెట్టుబడికి 14 నుంచి 15 లక్షల ఉద్యోగాలు వస్తున్నాయన్నారు. యువతను మోదీ 'వికసిత భారతానికి సూపర్ హీరోలు'గా చూస్తున్నారని అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా కోట్ల మంది యువతకు శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. గ్రామీణ యువతకు కూడా ఎఐ, ఎని వంటి ఆధునిక టెక్నాలజీని మాతృభాషలో నేర్పిస్తున్నామని తెలిపారు. భారత యువత ప్రపంచస్థాయిలో రాణిస్తోందని కిషన్ రెడ్డి అన్నారు. సెమీకండక్టర్లు, స్పేస్, డ్రోన్ టెక్నాలజీలో భారత్ ముందుకు వెళ్తోందన్నారు. చంద్రుడి దక్షిణ ధృవానికి ముందుగా చేరిన దేశం భారత్ అని చెప్పుకొచ్చారు. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో స్వదేశీ డ్రోన్లు శత్రు క్షిపణులను అడ్డుకున్నాయని అన్నారు. 2047 నాటికి వికసిత భారత్ లక్ష్య సాధనలో యువత పాత్ర కీలకమన్నారు. యూనివర్సిటీలు, కాలేజీలు, పీఎం-శ్రీ స్కూల్స్ సంఖ్య పెంచామని తెలిపారు. భారత్ ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని అన్నారు. 2014కు ముందు వందల స్టార్టప్స్ మాత్రమే ఉండగా, ఇప్పుడు 1.2 లక్షలకు పైగా ఉన్నాయన్నారు. మైనింగ్, బొగ్గు రంగాల్లో కూడా మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని యువతకు సూచించారు. మైనింగ్, ఇంజనీరింగ్ వంటి కోర్సులపై యువత దృష్టి సారించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సూచనలు చేశారు.

# ఎపికి ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యం

-మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్ గాంధీ భవన్‌లో జగ్గారెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీకి ప్రత్యేక హోదా సహా పలు అంశాలపై స్పందించారు. 'భక్తి అంటే నాది.. నేను రియల్ ఎస్టేట్‌లో సంపాదించిన డబ్బులతో సీతారాముల కల్యాణం చేస్తాను. తెలంగాణలో ఒక్క బీజేపీ నేత అయినా నాలాగా చేస్తారా?. రాములవారి కల్యాణం చేసి నేనెప్పుడైనా ఓట్లు అడిగానా?. ఛత్రపతి శివాజీకి లేని మతం మీకెందుకు?. శివాజీ దగ్గర ముస్లింలు మంత్రులుగా పనిచేశారు. బీజేపీ నేతలు చదువుకోవాలి. ఆ పార్టీ వాళ్లు మాట్లాడితే హిందువులు అంటారు. రాజ్యాంగాన్ని తీసేసే కుట్ర బీజేపీ చేస్తోంది. రాజ్యాంగ పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ పాటుపడు తున్నారు. ఆయన ఎక్కడికి వెళ్లినా ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. దేశ ప్రజలకు కవచం లాంటిది రాజ్యాంగం. కవచకుండలాలు ఉన్నంతకాలం కర్ణుడిని ఎవరూ చంపలేకపోయారు. అవి దానం చేశాక కర్ణుడి ప్రాణాలు పోయాయి. ఎన్నికల కమిషన్ ద్వారా ఓటు చోరీ చేసి కమలం పార్టీ అధికారంలోకి వచ్చింది. ఓట్లను దొంగిలించి ఎంపీ సీట్లు గెలిచింది. దేవుడి పేరుతో, మతం పేరుతో, దొంగ ఓట్లతో ఆ పార్టీ గెలుస్తోంది. దేశ ప్రజలు ఇప్పటికే ప్రమాదంలో ఉన్నారు. రాజ్యాంగాన్ని తీసేస్తే మరింత ప్రమాదంలో పడతారు. దేశం 67 ఏళ్ల పాలనలో రూ.54 లక్షల కోట్ల అప్పు చేస్తే.. బీజేపీ అధికారంలోకి వచ్చాక రూ.1,047 లక్షల కోట్ల అప్పులు చేసింది. ూహుల్ కుటుంబం అధికారం కోసం ఏనాడూ తాపత్రయపడలేదు. ఆయనది ఆస్తులు, ప్రాణత్యాగం చేసిన కుటుంబం. ప్రధాని పదవిని రాహుల్ త్యాగం చేశారు. అధికారం చేపట్టిన తర్వాత మోదీ చేసిన మంచి ఒక్కటి చెప్పండి' అని మండిపడ్డారు.

# ధాన్యం కొనుగోళ్లలో పూర్తి నిర్లక్ష్యం

-మొదటిపేజీ తరువాయి

కానీ ఒక్కరూ చనిపోలేదని మంత్రి అనడం సిగ్గుచేటని నిప్పులు చెరిగారు. 'పంటలు కొనక పోవడంతో గగ్గోలు పెడుతూ రైతులు, కాంగ్రెస్ కార్యకర్తలు కూడా రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నా కనిపించడం లేదా అని ప్రశ్నించారు. రైతులు ప్రాణాలు కోల్పోయినా నిస్సిగ్గుగా అబద్దాలు చెప్తున్నారని విరుచుకుపడ్డారు. అవసరమైతే ప్రభుత్వానికి రైతుల మరణాల వివరాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. మండుటెండల్లో రైతులు పంటలు అమ్ము కొనేందుకు పడిగాపులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. జిల్లాల్లోవివరాలు సేకరించాకనే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నానని స్పష్టంచేశారు. పంట కొనుగోలు సంక్షోభం, అన్నదాతలు ఎదుర్కొంటున్న విపత్కర పరిస్థితులను తెలుసుకుని మాట్లాడాలన్నారు. పంట కొనుగోలు సంక్షోభంపై చర్చించాలని, చర్యలకు ఆదేశించాలని అన్నారు.

## యాదగిరిగుట్టలో సిఎం పర్యటన

-మొదటిపేజీ తరువాయి

రూ.1.35 కోట్లతో నిర్మించనున్న రథశాల వైపు మాడవీధులకు మెట్ల నిర్మాణానికి, రూ.43.12 కోట్లతో డార్మిటరీ హాల్స్, దీక్షాపరుల సదన్ నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఉదయం ప్రత్యేక హెలికాప్టర్లో యాదగిరిగుట్ట పెద్దగుట్టపైకి చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డికి.. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, కలెక్టర్ అనురాగ్ జయంతి ఘన స్వాగతం పలికారు. సీఎంతో పాటు శాసనమండలి చైర్మన్ గుత్త సుఖేందర్ రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, ఎంపీ వేంనరేందర్ రెడ్డి.. యాదాద్రికి చేరుకున్నారు. పవిత్ర పుణ్యక్షేత్రం యాదగిరిగుట్టపై ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి సంప్రదాయ వేదపాఠశాల భవనానికి శంకుస్థాపన చేశారు. కంచి కామకోటి పీఠాధిపది శ్రీశంకర విజయేంద్ర సర్వస్వతి స్వామి సమక్షంలో ఈ క్రతువు జరిగింది. రూ.43.79 కోట్లతో క్షేత్రంలోని పెద్దగుట్ట ఆలయ నగరి లేఅవుట్ వద్ద 15 ఎకరాల విస్తీర్ణంలో వేదపాఠశాల భవనం నిర్మించనున్నారు. వచ్చే రెండేళ్లలో నిర్మాణం పూర్తి చేసి తరగతులు ప్రారంభించనున్నారు. అనంతరం శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారిని సీఎం దర్శించుకున్నారు.

## హరీష్ రావువి పగటి కలలు

-మొదటిపేజీ తరువాయి

బీఆర్ఎస్ అడ్డుకుంటోందని మంత్రి ఆరోపించారు. ఆ పార్టీ బ్లాక్‌మెయిలింగ్ రాజకీయాలకు యత్నిస్తోందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన మొదటిరోజు నుంచే బీఆర్ఎస్ నేతలు విమర్శలే ప్రధాన అంశంగా ముందు కెళ్తున్నారని తెలిపారు. జంట నగరాలకు సంబంధించిన మెట్రోను విస్తరించాలనుకుంటే అడ్డుకుంటున్నారని బీఆర్ఎస్ పార్టీ నేతలపై మంత్రి శ్రీధర్ బాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు చీప్ పాలిటిక్స్.. బ్లాక్ మెయిల్ పాలిటిక్స్ చేయొద్దని అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ఎక్కడ అభివృద్ధి చేస్తే అక్కడ ఆపుతామంటే ఎలా అని ప్రశ్నించారు. ప్రజలు కోరుకున్నది తప్పకుండా చేసి తీరుతామన్నారు. వేలాది కోట్లు పెడతామని మల్టీ నేషనల్ కంపెనీలు వస్తున్నాయని.. ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామంటే పెట్టుబడిదారులు భయపడరా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్ తెచ్చిన మెట్రోనే ముందుకు సాగిందని మంత్రి తెలిపారు. తాము ఎన్ని కిలోమీటర్లు తెచ్చామో అన్ని కిలోమీటర్లు మాత్రమే మెట్రో వచ్చిందని చెప్పారు. మెట్రోను విస్తరిద్దామంటే అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. పెరిగిన జనాభాకి అనుగుణంగా మెట్రో విస్తరించకూడదా అని ప్రశ్నించారు. అధికారంలోకి వస్తామని మాజీ మంత్రి హరీశ్ రావు పగటి కలలు కంటున్నారని విమర్శించారు. అసెంబ్లీ, పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయిందని.. అయినా ఆ పార్టీ నేతల బుద్ధి మారడం లేదని వ్యాఖ్యానించారు. నగరాన్ని విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోందని మంత్రి తెలిపారు. ప్రజల అవసరాల ను తీర్చడానికి ప్రణాళికలు రూపొందించామన్నారు. ఇతర నగరాల అభివృద్ధిపై అధ్యయనం చేశామన్నారు. రాబోయే తరాలకు ఉపయోగపడే కార్యాచరణ చేపట్టాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడానికే బీఆర్ఎస్ ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని అడ్డుకోవాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని మంత్రి ఆరోపించారు. ఓటమితో ఎదురైన నిరాశ నుంచి ఇప్పటికీ బయటకి రాలేకపోతున్నారన్నారు. బుల్లెట్ ట్రైన్ తెస్తామంటే.. ఎందుకని బీఆర్ఎస్ నేతలు అడ్డుపడుతున్నారని ఫైర్ అయ్యారు. తెలంగాణ యువతకు మంచి భవిష్యత్తు ఇవ్వొద్దా అని అన్నారు. స్వార్థ రాజకీయాలే తమకి ముఖ్యమని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు విరుచుకుపట్టారు.

## కుమారుడు ట్రంప్ జూనియర్ వివాహం

-మొదటిపేజీ తరువాయి

నేపథ్యంలో అది కష్టంగా మారే అవకాశం ఉందని తెలిపారు. 48 ఏళ్ల డొనాల్డ్ ట్రంప్ జూనియర్ ఈ వారాంతంలో తన ప్రియురాలు బెట్టినా ఆండర్సన్‌ను వివాహం చేసుకోనున్నారు. ఈ వేడుక బహమాస్‌లో జరగనుంది. భద్రతా కారణాల దృష్ట్యా ఈ వివాహానికి సన్నిహితులను మాత్రమే ఆహ్వానిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా ట్రంప్ జూనియర్ 2005లో వెనెసాను వివాహం చేసుకున్నారు. ఆ తర్వాత వీరి మధ్య విభేదాలు రావడంతో 13 ఏళ్ల తమ వైవాహిక బంధానికి స్వస్తి పలుకుతూ 2018లో విడాకులు తీసుకున్నారు. వీరికి ఐదుగురు సంతానం. 2020లో ట్రంప్ జూనియర్‌కు ఫాక్స్‌న్యూస్ మాజీ హోస్ట్ కింబర్లీతో నిశ్చితార్థం జరగ్గా.. తర్వాత దానిని రద్దు చేసుకున్నారు. అనంతరం మోడల్, సామాజికవేత్త అయిన బెట్టినా ఆండర్సన్‌తో ట్రంప్ జూనియర్ గతేడాది ఎంగేజ్‌మెంట్ చేసుకున్నారు.

## ప్రధాని మోడీతో రామ్మోహన్ కుటుంబం భేటీ

-మొదటిపేజీ తరువాయి

కుటుంబంతో కలిసి ప్రధాని మోదీని కలవటంపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఎక్స్‌లో ఓ భావోద్వేగ పోస్ట్ పెట్టారు. ఆ పోస్టులో.. 'ఈ రోజు మా కుటుంబానికి జీవితాంతం గుర్తుండిపోయే ఓ భావోద్వేగ క్షణం. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కుటుంబ సమేతంగా కలిసే అదృష్టం కలగడం ఎంతో ఆనందంగా, గర్వంగా భావిస్తున్నాను'.. ఆయన అసాధారణ వ్యక్తిత్వం, ఆప్యాయత మా కుటుంబంలోని మూడు తరాలను ఒకేలా ఆకట్టుకుంది. ప్రజల హృదయాల్లో ఆయన ఎందుకు అపారమైన ఆదరణ పొందారో ఆ క్షణంలో మరింత స్పష్టంగా తెలిసింది. ప్రత్యేకంగా.. 'ఏక్ పేడ్ మా కే నామ్' అనే మహత్తర ఆలోచనకు ప్రేరణగా నా తల్లి ప్రధానమంత్రికి మొక్కను బహుకరించడం మా కుటుంబానికి ఎంతో మధురమైన, గర్వకారణమైన క్షణంగా నిలిచిపోతుంది. ఆయన చూపిన ప్రేమ, ఆప్యాయత, ఆశీస్సులకు మేమెప్పటికీ కృతజ్ఞులమే. మాతో గడిపిన అమూల్యమైన సమయానికి వారికి హృదయపూర్వక ధన్యవాదాలు' అని అన్నారు.

# సంపాదకీయం


## సమాజానికి 'పోక్సో' ఓ హెచ్చరిక




ఢిల్లీలో జరిగిన నిర్భయ ఘటన వంటివి భవిష్యత్తులో జరగకూడదని 2013లో కేంద్ర ప్రభుత్వం పోక్సో చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. కానీ ప్రతి లక్ష మంది చిన్నారుల్లో 15.6 మంది పోక్సో చట్టం పరిధిలోకి వచ్చే లైంగిక నేరాలకు గురవుతున్నారనీ, ఏటికేడాది ఈ చట్టం కింద నమోదయ్యే కేసులు కూడా పెరుగుతున్నాయని జాతీయ నేర నమోదు విభాగం(ఎన్సీఆర్బీ) ఈ మధ్య తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. ఒక్క 2024లోనే దేశం మొత్తం మీద 69,191 పోక్సో కేసులు నమోదైతే, వారిలో తీవ్ర లైంగిక దాడులకు గురైన బాలికల సంఖ్య 43,675. కాగా ఈ బాధితుల్లో 16--18 ఏళ్ల బాలికలు 24,000 మందికి పైనే ఉన్నారు. ప్రతి పోక్సో కేసు వెనుక ఛిద్రమైన ఒక చిన్నారి జీవితమే కాదు, వ్యవస్థాగత లోపమూ కచ్చితంగా ఉంది. ఇటీవల తెలుగు రాష్ట్రాల్లో వెలుగులోకి వచ్చిన రెండు వరుస ఘటనలు నేటి కాలంలో పిల్లల భద్రతా లోపాలను మరోసారి ఎత్తిచూపుతున్నాయి. అదేవిధంగా సమాజానికి ప్రమాద సంకేతాలనూ పంపుతున్నాయి. హైదరాబాద్‌లో వెలుగులోకి వచ్చిన సంఘటన, అలాగే ఒంగోలుకు చెందిన ఒక మహిళా ప్రత్యేక అధికారిణి పోక్సో కేసులో జైలుకు వెళ్లడం వంటి సంఘటనలను కేవలం వ్యక్తిగత ఘటనలుగా చూడకూడదు. ఇవి సమాజంలో పెరుగుతున్న ప్రమాదకర ధోరణికి హెచ్చరికలు. విలువల సంక్షోభానికి, అధికార వ్యవస్థల్లో ఏర్పడుతున్న నైతిక పతనానికి ఇవి స్పష్టమైన సంకేతాలు. చాలావరకూ పోక్సో కేసుల్లో బాధితులు తమకు తెలిసిన వ్యక్తుల చేతుల్లో లైంగిక దాడులకు గురవుతున్నారు. అసలు ఎందుకు ఇటువంటి ఘటనలు పెరుగుతున్నాయి? ఇది కేవలం చట్టవ్యవస్థ వైఫల్యమా? లేక సమాజం మొత్తం నెమ్మదిగా ఒక అనాసక్తి, నైతిక గందరగోళం వైపు జారిపోతుందా? ఇలాంటి ఘటనలు బయటపడినప్పుడల్లా మన సమాజం రెండు ప్రమాదకరమైన ప్రతిస్పందనలు చూపుతోంది. ఒకటి-- ఇవి రాజకీయంగా తయారు చేసిన కేసులు కావచ్చు అని. రెండోది-- రెండు రోజులు చర్చించి మర్చిపోవడం. ఈ రెండు ధోరణులూ ప్రమాదకరమే. ఇప్పుడు అవసరమైంది కేవలం చట్టాలు సక్రమంగా అమలు కావడం ఒక్కటే కాదు. వాటి గురించి బాలలకు అవగాహన కల్పించడం, బాధ్యతాయుతమైన వ్యక్తులుగా మెలిగేలా, తమని తాము కాపాడుకునేలా చూడటం కూడా ఎంతో అవసరం. ఇప్పుడు నేరాల తీరు మారుతోంది. 'డిజిటల్ గ్రూమింగ్' అనే కొత్త ముప్పు పిల్లలను మరింత ప్రమాదంలోకి నెడుతోంది. సోషల్ మీడియా, మొబైల్ ఫోన్లు, ప్రైవేట్ చాట్స్, గేమింగ్ ప్లాట్‌ఫారాలు-- నేరస్తులకు పిల్లల వరకు చేరుకునే మార్గాలుగా మారుతున్నాయి. పిల్లలు ఏం చూస్తున్నారు? ఎవరితో మాట్లాడుతున్నారు? అనే విషయంలో కుటుంబాల్లో పర్యవేక్షణ తగ్గిపోవడం పరిస్థితిని మరింత సంక్లిష్టం చేస్తోంది. అలానే వెబ్ సిరీస్‌లు, సినిమాల్లోని మితిమీరిన నేర, అశ్లీల దృశ్యాలు యువతపై వికృత ప్రభావం చూపుతున్నాయి. వాటి ప్రేరణతో అకృత్యాలకు, నేరాలకు పాల్పడుతున్న మైనర్లు, యువత సంఖ్య కూడా ఇటీవల అధికమవుతోంది. చాలా మంది చిన్నారులు తమపై జరిగిన దాడిని బయటకు చెప్పలేకపోతున్నారు. ఎందుకంటే అది లైంగిక దాడి అని తెలియకపోవడం, మరొకటి భయం. 'కుటుంబ పరువు పోతుంది' అనే మానసిక ఒత్తిడి వారిని మౌనంలోకి నెడుతోంది. చాలా విద్యాసంస్థల్లో చైల్డ్ ప్రొటెక్షన్ మెకానిజం కేవలం పత్రాలకే పరిమితం అవుతోంది. పిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి చాలా చోట్ల స్పష్టమైన అవగాహన ఇవ్వడం లేదు. స్కూల్ కౌన్సిలర్లు, ఫిర్యాదు వ్యవస్థలు సక్రమంగా లేకపోవడంతో పిల్లలకు తమ సమస్యలను చెప్పుకునే అనువైన వాతావరణం విద్యాసంస్థల్లో కరువవుతోంది. పిల్లలకు మొదటి గురువులు తల్లిదండ్రులే. కాబట్టి వాళ్లని వాళ్లు కాపాడుకోవడంతో పాటు సమాజంలో ఉత్తమ పౌరుడిగా ఎదిగేందుకు రెక్కలు ఇవ్వాలి. తల్లిదండ్రులు పిల్లలతో మాట్లాడటమేకాక, స్వేచ్ఛగా ప్రతి విషయం పంచుకునే సమయాన్నీ చొరవనీ కల్పించాలి. ఎన్ని తలమునకలయ్యే బాధ్యతలు ఉన్నా పిల్లల్ని ఓ కంట గమనిస్తూ ఉండాలి. వారి భావోద్వేగాల్ని, భయాల్ని చెప్పకుండానే అర్థం చేసుకునే ప్రయత్నం చేయాలి. స్కూళ్లలో నైతిక విలువల పట్ల విద్యార్థులకు, యువతకు అవగాహన కల్పించాలి. అందుకోసం చదువుల్ని సంస్కరించాలి. విద్యాసంస్థల యాజమాన్యాలు సైతం విద్యార్థులను నిశితంగా గమనించాలి. ప్రతి స్కూల్‌లోనూ పిల్లల భద్రతతో పాటు, పోక్సో చట్టం గురించి అవగాహన తరగతులు నిర్వహించాలి. పిల్లలకు సైబర్ నేరాలతోపాటు, చట్టాలు, శిక్షల గురించి కూడా తెలియజెప్పాలి. మీడియాలో నిరంతరం వచ్చే విషయాలను వారి దృష్టికి తేవడంతో పాటు పర్యవసానాలను వివరించి చెప్పాలి. స్కూళ్లలోనే కాదు, గేటెడ్ కమ్యూనిటీల నుంచి గ్రామవార్డుల వరకూ దీనిని చర్చించదగిన అంశంగా పరిగణించి ప్రభుత్వంతో పాటు ఎన్జీవోలు కూడా సామాన్యుల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు నడుం బిగించాలి. పోక్సో చట్టం గురించి చెప్పడంతో పాటు అన్యాయం జరిగిన వెంటనే ఫిర్యాదు చేసే ధోరణిని అలవాటు చేయాలి. ఈ విషయం మనం సీరియస్‌గా తీసుకోకపోతే, రేపటి తరానికి భద్రమైన బాల్యం ఇవ్వలేం.

# ముసుగులు తొలగిన మతతత్వం









'వారు నాకు ఓటు వేయలేదు. వారి బాగోగులకు నేను బాధ్యత వహించను'-- పశ్చిమ బెంగాల్ శాసనసభకు కొత్తగా ఎన్నికైన బీజేపీ ఎమ్మెల్యే రితేశ్ తివారీ అన్న మాటలవి. ఈ ఉద్ఘాటన మానవ ధర్మ ప్రేరితమేనా? ఒక్క క్షణం ఆలోచించండి. ఆ మాటల్లోని అనైతికత, దుర్మార్గం అర్థమవుతుంది. రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికైన ప్రజాప్రతినిధి అలా మాట్లాడవచ్చునా? పరిపాలన, పౌరసత్వ హక్కులు ఇప్పుడు మతపరమైన ఓటింగ్ సరళిపై ఆధారపడి ఉన్నాయని ఆ ప్రజాప్రతినిధి ప్రభావశీలంగా సూచించడమే కాదూ ఆ ప్రకటన? ముస్లింలు తనకు ఓటు వేయనప్పుడు తాను ప్రాతినిధ్యం వహించేందుకు వారు సరైన అర్హులు కారని ఆ బెంగాలీ ఎమ్మెల్యే ఆ మాటలతో చెప్పకనే చెప్పాడు. రవీంద్రుడి ఆత్మ క్షోభించి ఉంటుంది. విశాల భారతావని ఆ మహాకవిని మరచిపోనట్లయితే కొత్త 'ప్రజాప్రతినిధి' కుత్సిత పలుకులకు భగ్గుమనేది కాదూ? అలా జరగలేదు! ఇదే, బహుశా, ఈ బెంగాల్ ముచ్చటలోని అత్యంత ఆందోళనకరమైన విషయం. వర్తమాన భారతదేశంలో నేడు మనం కంటున్నవీ వింటున్నవీ కేవలం మతతత్వ రాజకీయాలు కావు. అవి ఇంతకు ముందు కూడా ఉన్నాయి. ఇప్పుడు మనం చూస్తోంది మతతత్వ రాజకీయాల సర్వవ్యాపకత్వం. అవును, అవి సర్వసాధారణమైపోయాయి. ఆ బెంగాలీ అన్న మాటలను గతంలో ఎవరైనా వదరి ఉంటే వారి రాజకీయ జీవితాలకు అవి భరతవాక్యాలు అయివుండేవి. అయితే ఇప్పుడు అవి కేవలం ఎన్నికల ప్రలాపమని, పట్టించుకోవల్సినంత ముఖ్యమైనవి ఏ మాత్రం కావని కొట్టివేస్తున్నారు! మత ప్రాతిపదికన ప్రజలను సమీకరించేందుకు రాజకీయులు ఇంకెంత మాత్రం సంకోచించడం లేదు. గతంలో గోప్యంగా చేసిన ఆ పనిని ఇప్పుడు బాహాటంగా అడ్డూ అదుపులేని రీతిలో నిస్సంకోచంగా చేస్తున్నారు. అందుకే కాబోలు భారత జాతీయ కాంగ్రెస్‌ను 'కొత్త ముస్లిం లీగ్' అని కేంద్ర మంత్రి కిరెన్ రిజిజు అభివర్ణించారు. రిజిజు వ్యాఖ్య వెనుక ఉన్న వాదన ఏమిటో నిశితంగా చూద్దాం. అసోం, బెంగాల్ ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ అభ్యర్థులు అందరూ దాదాపుగా ముస్లిం అభ్యర్థులే అయినందున కాంగ్రెస్ ఒక మతతత్వ పార్టీగా పరిణమించింది. అవును, అసోంలో ఎన్నికైన 19 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో 18 మంది ముస్లింలే. అలాగే బెంగాల్‌లో గెలిచిన కాంగ్రెస్ అభ్యర్థులు ఇరువురూ ముస్లింలే. సరే, కేరళలో కాంగ్రెస్ మిత్రపక్షం ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ ఎన్నికల్లో జయాపజయాలను ప్రభావశీలంగా నిర్ణయించే రాజకీయ శక్తి. అయితే కాంగ్రెస్‌ను మతతత్వ పార్టీగా నిందిస్తున్నవారు ఒక వాస్తవాన్ని విస్మరిస్తున్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌కు 650 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. వారిలో అత్యధికులు ముస్లిమేతరులే. అయినప్పుడు కాంగ్రెస్ మతతత్వ పార్టీ ఎలా అయింది? ఆ ప్రశ్నకు సమాధానం అంక గణితంలో కాకుండా రాజకీయ సందేశం-- ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేసేందుకు చేసే ప్రసంగాలు, ప్రకటనలు సామాజిక మాధ్యమాల్లో జరిగే ప్రచారం-- లో ఉన్నది. ముస్లింల రాజకీయ ప్రాతినిధ్యాన్ని అనుమానాస్పదం చేయడమే అసలు లక్ష్యం. ప్రధానస్రవంతి ప్రతిపక్ష పార్టీ అభ్యర్థులుగా ముస్లిం అభ్యర్థులు చెప్పుకోదగిన సంఖ్యలో ఎన్నికైనప్పుడు సదరు పార్టీపై మతతత్వ పార్టీ అనే ముద్ర వేయడమే అటువంటి వ్యాఖ్యలు చేసేవారి అభీష్టం. మైనారిటీ వర్గాల ప్రాతినిధ్యాన్ని చట్టవిరుద్ధం చేయడం, మెజారిటీ వర్గ ఆధిపత్యాన్ని జాతీయ వాదంగా చూపడమే రిజిజు వ్యాఖ్య పరమార్థం. ఈ రాజకీయ విలోమం చాలా చాలా ప్రమాదకరమైనది. బెంగాల్‌లో సువేందు అధికారి పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన హిందువులకు బీజేపీకి ఓటువేయమని బహిరంగంగా విజ్ఞప్తి చేశారు. గెలిచిన తరువాత వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఇదే ఏ ప్రతిపక్ష నాయకుడు అయినా పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన ముస్లిం ఓటర్లకు తమ పార్టీకి ఓటువేయమని విజ్ఞప్తి చేసి ఉంటే ఏమయివుండేది? లౌకికవాదాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత హిందువులపైనే ఎందుకు మోపుతున్నారని పలువురు తరచు ప్రశ్నిస్తున్నారు. ముస్లిం ఓటర్లు ప్రధానంగా ముస్లిం అభ్యర్థులకే ఎందుకు ఓటు వేస్తున్నారు? ముస్లిం ఓటర్లు అత్యధికంగా ఉన్న నియోజకవర్గం నుంచి హిందూ అభ్యర్థి విజయం సాధించగలడా? ఇవి న్యాయబద్ధమైన ప్రశ్నలే. వీటికి సమాధానం ఒక రాజకీయ వాస్తవాన్ని గుర్తించడంలో ఉన్నది: భారత జనాభాలో హిందువులు 80శాతంగా ఉన్నారు. పరిపూర్ణ భద్రతా భావంతో నిండు ఆత్మ విశ్వాసంతో ఉన్న మెజారిటీ హిందువులు మాత్రమే దేశం మెజారిటేరియన్ జాతీయవాదంలోకి జారిపోకుండా నివారించగలరు. సరే, లౌకికవాదం బలహీనపడడం బీజేపీతో మాత్రమే ఆరంభమయిందా? అలా భావించడం, ఆ సంక్షోభానికి ఆ పార్టీనే తప్పుపట్టడమంటే ఆత్మ వంచన చేసుకోవడమే అవుతుంది. లౌకికవాద పార్టీలుగా పరిగణన పొందుతున్న రాజకీయ పక్షాలు రెండు చారిత్రక తప్పిదాలకు పాల్పడ్డాయి. ముస్లింల సామాజిక పురోగతి, ఆర్థికాభ్యుదయానికి చిత్తశుద్ధితో కృషి చేయకుండా వారిని తమ ఫిక్స్‌డ్ డిపాజిట్ ఓటు బ్యాంకుగా చూడడం మొదటి చారిత్రక నేరం. మితవాద ముస్లిం మతాచార్యుల ఒత్తిడికి లొంగిపోయి షాబానో కేసు తీర్పును కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయడమైనా, లేదా ప్రాంతీయ పార్టీలు తమ ప్రతీకాత్మక రాజకీయాల ద్వారా ముస్లింల అభద్రతా భావాన్ని స్వార్థ ప్రయోజనాలకు ఉపయోగించుకోవడమైనా ముస్లింలకు తరచు పంపుతున్న సందేశం: మాకు ఓటు వేయండి. మిమ్ములను హిందూ మితవాదుల నుంచి సంరక్షిస్తాం. సంరక్షణ రాజకీయంగా మారింది. అయితే సాధికారత అరుదుగా లభించింది. లౌకికవాద పార్టీలు పాల్పడిన రెండో చారిత్రక తప్పిదం కూడా మొదటిదాని వలే లౌకికవాద విలువలకు తీవ్ర నష్టం చేసింది. హిందూ ఓట్లను బీజేపీకి కోల్పోతామనే భయంలో లౌకికవాదాన్ని దృఢవిశ్వాసంతో పరిరక్షించడానికి బదులుగా మృదు హిందుత్వను పాటించడంలో ఉత్సాహం చూపాయి. తద్వారా బీజేపీని సమర్థంగా ఎదుర్కోగలమని విశ్వసించాయి. 1980ల్లో రాజీవ్‌గాంధీ ప్రభుత్వం బాబ్రీమసీదుకు దశాబ్దాలుగా వేసి ఉన్న తాళాలను తెరవడాన్ని గుర్తు చేసుకోండి. అలాగే 2017లో గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో రాహుల్‌గాంధీ సందర్శించని హిందూ దేవాలయం ఏదైనా ఉన్నదా? లౌకికవాద పార్టీలు ఎప్పుడైతే మృదు హిందూత్వను పాటించడంలో నిమగ్నమయ్యాయో అప్పుడే మతవాద భావజాలానికి రాజకీయ ఆమోదం లభించేందుకు అనుద్దేశపూర్వకంగా తోడ్పడ్డాయి. దీనికి తోడుగా అస్తిత్వ రాజకీయాలు ప్రబలమయ్యాయి. ముస్లింలకు మరింత అధికంగా రాజకీయ ప్రాతినిధ్యం, వారు ఎదుర్కొంటున్న సామాజిక సమస్యలు మొదలైన అంశాల ప్రాతిపదికన అసదుద్దీన్ ఓవైసీ తదితర ముస్లిం నాయకులు అస్తిత్వ రాజకీయాలను బలోపేతం చేశారు. మృదు హిందుత్వ, అస్తిత్వ రాజకీయాలు ఒక విషవలయమై మున్నెన్నడూ లేని ప్రమాదకర పరిస్థితికి దారితీశాయి. హిందూ మెజారిటీవాద రాజకీయ ప్రలాపాలు ముస్లింలలో అభద్రతా భావాన్ని పెంపొందించాయి. ఈ అభద్రత ముస్లిం అస్తిత్వ రాజకీయాలను బలోపేతం చేశాయి. తీవ్రవాద ముస్లిం రాజకీయాలు హిందువుల్లో భయాందోళనలు సృష్టించి మితవాద, మతవాద భావజాలాలవైపు మొగ్గేలా చేశాయి. ఇదిలా వుండగా రాజ్యాంగ బద్ధ పాలన కుంచించుకుపోవడం అంటే రాజ్యాంగ సంస్థలు బలహీనపడడం, సమాఖ్య పాలనా పద్ధతులు క్షీణించడం, ప్రజాస్వామ్య నియమాల ఉల్లంఘన ఆరంభమయింది. రాజకీయ ఆమోదయోగ్యతను మతపరమైన గుర్తింపు నిర్ణయించడమే ఆ విపత్కర మార్పుకొక నిదర్శనం. దశాబ్దాల క్రితం ఎ.ఆర్. అంతులే మహారాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యారు. హిందూ ఓటర్లు అత్యధికంగా ఉన్న కాన్పూర్ నుంచి 1989లో కాంగ్రెస్ అభ్యర్థిగా అరిఫ్ మహమ్మద్ ఖాన్ గెలుపొందారు. ఇప్పుడు అటువంటి విజయాలను ఊహించగలమా? 20 కోట్ల మందికి పైగా ముస్లింలు ఉన్న భారత్‌లో ఒక్క రాష్ట్రానికి సైతం ముస్లిం ముఖ్యమంత్రి లేడు; 18 రాష్ట్రాలలో ముస్లిం మంత్రి ఒక్కరంటే ఒక్కరూ లేరు; బెంగాల్‌లో మూడింట రెండు వంతుల మెజారిటీతో విజయం సాధించిన బీజేపీ ఎమ్మెల్యేలలో ఒక్క ముస్లిం కూడా లేడు; పన్నెండేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తరపున లోక్‌సభకు ఎన్నికైన ముస్లిం ఎంపీ ఒక్కరూ లేరు. హిందూత్వ అప్రతిహత పురోగతి మూలంగా రాజకీయ భారతంలో ముస్లింలు ఉనికిని దాదాపుగా కోల్పోయినట్టుగా కనిపిస్తోంది. ఒక మత వర్గాన్ని ప్రధానస్రవంతి రాజకీయాల నుంచి మినహాయిస్తే 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్' (అందరి సహకారంతో అందరి అభివృద్ధి) అనే పాలనా ఆదర్శం ఎలా సాకారమవుతుంది? ఇవి ఇబ్బందికరమైన ప్రశ్నలు. అయితే పాలకులకు బాధాకరమనిపించే ప్రశ్నలు అడగడాన్ని ఆపివేస్తే ప్రజాస్వామ్యం నశించిపోతుంది. మతతత్వ రాజకీయాలను ఇప్పుడు ఇంకెంత మాత్రం పథ భ్రష్ట వ్యవహారాలుగా చూడకపోవడమే వర్తమాన భారతదేశ అసలు విషాదం. వాటిని ఎన్నికల సర్వసాధారణ విషయంగా అంగీకరించడం అంతకంతకూ అధికమవుతోంది. ఇదే నిజమైన ప్రమాదం. మన ప్రజాస్వామ్యానికి సంభవిస్తున్న ఎనలేని హాని. దేశ పౌరులు ప్రాథమికంగా ఒకరినొకరు సహచర భారతీయులుగా కాకుండా హిందువులుగా, ముస్లింలుగా భావించుకోవడం ప్రారంభమైతే మన రాజ్యాంగ లౌకికవాదం అంతఃశక్తిని కోల్పోయి నిరర్థకమవుతుంది. ఇదే సంభవిస్తే మన సమున్నత ప్రజాస్వామిక గణతంత్ర రాజ్యం సంకుచితమైపోతుంది. పౌరసత్వ విశాల భావనలు నశించిపోతాయి. మతవిశ్వాసాలకు అతీతంగా అందరికీ సమాన హక్కులు మృగ్యమైపోతాయి. స్వరూప స్వభావాలు మారిపోయిన రాజకీయ భారతం అశుభ సూచకమైన 'హిందూ పాకిస్థాన్' సదృశమవుతుంది.

# ఐటీఐ విద్యార్థులకు వేసవి సెలవులు ప్రకటించాలి చిప్పకుర్తి శ్రీనివాస్

హంసకలం వార్త మే 23 మంచిర్యాల జిల్లా ప్రతినిధి

జిల్లాలోని ఐటిఐ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా సెలవులు ప్రకటించాలని కోరుతూ తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక (TVUV) తరపున జిల్లా ఐటిఐ కళాశాలల కన్వీనర్ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక రాష్ట్ర కార్యదర్శి చిప్పకుర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ....జిల్లాలో ఐటిఐ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఎండ తీవ్రతల నేపథ్యంలో వేసవి సెలవులు ప్రకటించకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని,అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోతల మధ్య తరగతులకు హాజరవడం విద్యార్థులకు కష్టసాధ్యంగా మారింద న్నారు. విద్యార్థులకు సురక్షితమైన తాగునీరు మరియు మరుగుదొడ్లు కరువై ఇబ్బందులు పడుతున్నారాని, అదేవిధంగా విద్యార్థులకు సివిల్ డ్రెస్సులపై ఉన్న ఆంక్షలను తొలగించాలని అన్నారు.




వెంటనే ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థుల సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కార చర్యలు చేపట్టడంతో పాటు,విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తక్షణమే వేసవి సెలవులు ప్రకటించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు సాయి ,పవన్ ,కుమార్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# చెన్నూరు వడ్ల కేంద్రంలో రగడ

-చెన్నూరులో వడ్ల కొనుగోలు ఆలస్యం..రైతుల ఆవేదన..
-అన్లోడ్ పేరుతో అధిక వసూళ్లు..
-తేమ కోతలతో క్వింటాల్‌పై భారం..
-కేంద్రాన్ని పరిశీలించిన దుర్గం అశోక్, చర్యల డిమాండ్..

హంసకలం వార్త మే 23 మంచిర్యాల జిల్లా ప్రతినిధి

చెన్నూరు మండలం కిష్టంపేట గ్రామంలోని వడ్ల కొనుగోలు కేంద్రం వద్ద రైతులు తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్నారు. నెల రోజులుగా వడ్లు అక్కడే నిల్వ ఉండటంతో ఎండ వేడి, వర్ష భయం మధ్య రైతులు తమ పంటను కాపాడుకోవడంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సరైన రవాణా సౌకర్యం లేకపోవడం, కొనుగోలు ప్రక్రియలో జాప్యం కొనసాగుతుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క లారీ ఆధారంగా రవాణా జరగడం వల్ల వడ్ల తరలింపు ఆలస్యమవుతోందని, పంటను కాపాడుకోవడం కష్టంగా మారిందని రైతులు వాపోతున్నారు..అదేవిధంగా తాగునీటి సౌకర్యం, షెడ్లు వంటి కనీస మౌలిక వసతులు లేకపోవడంతో రైతులు ఎండలో, వర్షంలో రోజుల తరబడి ఎదురుచూడాల్సి వస్తోందని తెలిపారు. అంతేకాక అన్లోడ్ పేరుతో బస్తాకు అధిక చార్జీలు వసూలు చేయడం, లారీలు తీసుకురావాలంటే అదనపు డబ్బులు డిమాండ్ చేయడం, తేమ పేరుతో ప్రతి బస్తాకు రెండు నుండి ఐదు కిలోల వరకు కోత విధించడం వంటి చర్యల వల్ల క్వింటాల్‌పై భారీ భారం పడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దుర్గం అశోక్ వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. రైతుల సమస్యలను తెలుసుకున్న ఆయన వెంటనే వ్యవసాయ అధికారి ఏఓ యామినికి ఫోన్ చేసి కొనుగోలు ప్రక్రియను తక్షణమే వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం చెన్నూరు మార్కెట్ యార్డ్ గోదాం వద్ద అధికారులతో మాట్లాడి ఎలాంటి కోతలు లేకుండా అన్లోడ్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రైతుల కష్టాలపై స్పందించిన దుర్గం అశోక్, కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న జాప్యం, రవాణా లోపాలు, సిబ్బంది నిర్లక్ష్యం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని



విమర్శించారు. ఒక్క లారీతో వ్యవస్థ నడపడం వల్లనే ఈ పరిస్థితి తలెత్తుతోందని ఆయన పేర్కొన్నారు. తరుగు పేరుతో కోతలు, అన్లోడ్ పేరుతో వసూళ్లు, రవాణా కోసం అదనపు డబ్బులు వసూలు చేయడం పూర్తిగా రైతులపై భారంగా మారిందని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకత తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ చెన్నూరు మండల అధ్యక్షుడు బుర్ర రాజశేఖర్ గౌడ్, 18వ వార్డు కౌన్సిలర్ ఏతం శివకృష్ణ, మాజీ చెన్నూరు పట్టణ అధ్యక్షుడు జాడి తిరుపతి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఆలం బాపు, చెన్నూరు పట్టణ ప్రధాన కార్యదర్శి కాయిత వెంకటేష్, సీనియర్ నాయకులు యువరాజ్, రాజేశ్ చింతల తదితరులు పాల్గొన్నారు..

# దైనందిన జీవితంలో వ్యాయామానికి కొంత సమయం కేటాయించాలి

-జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య

హంసకలం వార్త మే 23, మంచిర్యాల జిల్లా ప్రతినిధి

ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో కొంత సమయం వ్యాయామం, యోగ కు కేటాయించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యువజన క్రీడా ముగింపు కార్యక్రమానికి జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి హనుమంతరెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి, ప్రభుత్వ ఐ.టి.ఐ. కళాశాల ప్రిన్సిపల్ రమేష్, ఇతర అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికా కార్యక్రమంలో భాగంగా ఈనెల 18వ తేదీ నుండి 23వ తేదీ వరకు జిల్లా క్రీడా శాఖ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. 18వ తేదీన ఫిట్ ఆ యాక్టివ్ తెలంగాణ, మారథాన్ – ఫిజికల్ లిటరసీ, 19వ తేదీన కెరీర్ & స్కిల్ డెవలప్మెంట్ – ఎం పవర్ స్కిల్స్, ఎం పవర్ ఫ్యూచర్, 20వ తేదీన యూత్ లీడర్ షిప్ సమ్మిట్, 21వ తేదీన ప్లే ఆ పార్టిసిపేట్ – స్పోర్ట్స్ డే, 22వ తేదీన సర్వ్ ఆ సపోర్ట్ – యూత్ ఫర్ క్లీన్ తెలంగాణ, 23వ తేదీన ఉద్యోగ సాధన – కనెక్టింగ్ టాలెంట్ విత్ ఆపర్చునిటీస్ వంటి కార్యక్రమాలను అధికారుల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. 99 రోజుల కార్యాచరణలో భాగంగా చేపట్టిన కార్యక్రమాలలో వివిధ జిల్లా శాఖల అధికారులు, క్రీడాకారులు, యువత, విద్యార్థులు, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారని తెలిపారు. ప్రజల ఆరోగ్యకర జీవనశైలి, యువతకు ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించడం, మాదకద్రవ్యాల నియంత్రణ, నైపుణ్యాభివృద్ధి, ప్లాస్టిక్ రహిత సమాజం తదితర అంశాలపై చర్చలు, చిత్రలేఖన పోటీలు, సాంస్కృతిక ప్రదర్శన నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికల అందజేత, పారిశుధ్య



నిర్వహణపై ప్రత్యేక కార్యక్రమాలు, స్పోర్ట్స్ డే వంటి కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని జిల్లాలో అన్ని విభాగాలలో విజయవంతం చేసేలా అధికారులు సమన్వ యంతో కృషి చేయాలని తెలిపారు. అనంతరం చిత్రలేఖనం, క్రీడ పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలు వంటి అంశాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, యువతి యువకులు, విద్యార్థులు, యువజన సంఘాల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసులకు హెల్త్ క్యాంప్

-కేపీహెచ్‌బీలో పోలీసులకు మెడికల్ క్యాంప్..
-90 మంది సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు..

కేపీహెచ్‌బీ, మే 23 ( హంసకలం వార్త )

విధి నిర్వహణలో నిత్యం ప్రజల భద్రత కోసం శ్రమిస్తున్న పోలీస్ సిబ్బంది ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ సింధు హాస్పిటల్, మాధాపూర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వార్షిక మెడికల్ క్యాంప్ ఘనంగా జరిగింది. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, కూకట్‌పల్లి జోన్ డీసీపీ రితిరాజ్ మార్గదర్శకత్వంలో కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరంలో కేపీహెచ్‌బీ లా అండ్ ఆర్డర్ పోలీస్ సిబ్బంది, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది సహా దాదాపు 90 మంది పాల్గొని ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. పోలీస్ సిబ్బంది ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని వైద్య నిపుణులు పలు రకాల పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, ఈసీజీ, రక్త పరీక్షలు, బాడీ మాస్ ఇండెక్స్ బిఎం నేత్ర పరీక్షలు, సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటు అవసరమైన వారికి వైద్య సూచనలు అందించారు. నిరంతరం ఒత్తిడితో కూడిన విధుల్లో పనిచేసే పోలీస్ సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు ఎంతో అవసరమని వైద్యులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రజల రక్షణలో ముందుండే పోలీస్ సిబ్బంది ఆరోగ్యం బాగుంటేనే సమర్థవంతమైన సేవలు అందించగలరని తెలిపారు. పోలీస్ శాఖలో పని ఒత్తిడి, నిరంతర డ్యూటీలు, అనియంత్రిత జీవనశైలి కారణంగా అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశాలు ఉన్నాయని, వాటిని ముందుగానే గుర్తించి చికిత్స అందించేందుకు ఇలాంటి మెడికల్ క్యాంపులు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. సింధు హాస్పిటల్ వైద్య బృందం ప్రతి పోలీస్ సిబ్బందికి ప్రత్యేకంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి



అవసరమైన వైద్య సలహాలు ఇచ్చింది. ఈ కార్యక్రమం పోలీస్ సిబ్బందిలో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంలో కీలక పాత్ర పోషించిందని అధికారులు అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు..

# ప్రజాపాలనలో ప్రజలు ఫైర్

-బాలాజీనగర్‌లో సమస్యలపై ప్రజల గళం..
-డ్రైనేజీ, రోడ్లపై అధికారులకు వినతి..
-ట్రాఫిక్, దోమల సమస్యలపై ఆగ్రహం..
-సమస్యలు పరిష్కరిస్తామన్న అధికారులు..

బాలాజీనగర్, మే 23 ( హంసకలం వార్త )



కూకట్‌పల్లి బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని బాలాజీనగర్ చిల్డ్రన్స్ ఉమెన్స్ పార్క్‌లో నిర్వహించిన ప్రజాపాలన, ప్రజల ప్రణాళిక కార్యక్రమంలో కాలనీవాసులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కూకట్‌పల్లి సర్కిల్ డీసీ ఆంజనేయులు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో బాలాజీనగర్ 115 డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కృష్ణ రాజ్‌పుత్ వివిధ కాలనీల సమస్యలను వివరించారు. వెంకట్‌కృష్ణ అపార్ట్‌మెంట్ పరిధిలో స్ట్రీట్‌లైట్లు ఏర్పాటు, పీపుల్ హాస్పిటల్ లైన్ రోడ్డులో డ్రైనేజీ, రోడ్ల మరమ్మతులు, విజయదుర్గ నుంచి ఓమిని హాస్పిటల్ రోడ్డువరకు క్రాస్ రోడ్ విస్తరణ, ట్రాఫిక్ సమస్య పరిష్కారం, టీఎన్ఆర్ కాలనీలో చెరువు సమీపంలో వృద్ధాశ్రమం, కమ్యూనిటీ హాల్ ఏర్పాటు, వివేక్‌నగర్ కమ్యూనిటీ హాల్ విస్తరణ, పాఠశాల మార్పిడి, హాస్టల్ ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్యల పరిష్కారం వంటి అంశాలను ప్రస్తావించారు. అలాగే పార్కుల్లో దోమల నివారణ చర్యలు, జిమ్ పరికరాల మరమ్మతులు, ఇసుక నింపడం, పారిశుద్ధ్య సమస్యలు, పిల్లల కోసం ఇండోర్ గేమ్స్ జోన్ ఏర్పాటు, కూకట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రి బస్టాప్ వద్ద ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు, రాధాకృష్ణ నుంచి ఆర్వీ లక్ష్మి అపార్ట్‌మెంట్ వరకు స్ట్రీట్‌లైట్లు ఏర్పాటు, రాత్రివేళల్లో మద్యం సేవిస్తూ వాహనాలు పార్కింగ్ చేయడంపై చర్యలు, వీధి కుక్కల సమస్యల పరిష్కారం కోరారు. టీఎన్ఆర్ కాలనీ, వివేక్‌నగర్ కాలనీ, బాలాజీనగర్ కాలనీ, న్యూ బాలాజీనగర్ కాలనీ, కేపీహెచ్‌బీ కాలనీలలో వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని డ్రైనేజీలు, రోడ్లు, స్ట్రీట్‌లైట్లు, మాన్‌హోల్స్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు..ఈ సమస్యలను ఉన్నతాధికారులు, కూకట్‌పల్లి ఇంచార్జ్ బండి రమేష్, ఇంచార్జ్ మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు..

# ప్రజల సమస్యలపై బండి రమేష్ ఫోకస్

కూకట్‌పల్లి, మే 23 ( హంసకలం వార్త )




కూకట్‌పల్లి నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న భూసంబంధిత, రిజిస్ట్రేషన్ సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ శనివారం సచివాలయంలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రిని పూల మొక్కతో ఆహ్వానించి శాలువాతో సన్మానించారు. అనంతరం కూకట్‌పల్లి నియోజకవర్గంలోని వసంతనగర్ పరిధిలో ఉన్న ఐడిపిఎల్ కార్మికుల సహకార గృహ నిర్మాణ సంఘం, ఎన్ఆర్ఎస్ఏ కాలనీలకు సంబంధించిన సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సర్వే నంబర్లు 145, 163 పరిధిలోని ఇళ్ల రిజిస్ట్రేషన్లు కొంతకాలంగా నిలిచిపోయాయని, గతంలో రిజిస్ట్రేషన్ అయిన ఇళ్లకు కూడా నిర్మాణ అనుమతులు ఇవ్వడం లేదని బండి రమేష్ వివరించారు. నాలుగు దశాబ్దాలుగా అక్కడే నివాసం ఉంటున్న ప్రజలు అధికారుల నిర్లక్ష్యంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రజల ఆవేదనను శ్రద్ధగా విన్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమస్యపై అధికారులతో చర్చించి, అడ్డంకులు ఎక్కడున్నాయో తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు బండి రమేష్ తెలిపారు

# ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి

-ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఫోకస్..
-ఎమ్మెల్యే నివాసంలో నేతలు, కార్యకర్తల సందడి..
-వినతులు స్వీకరించి పరిష్కారానికి హామీ..
-కుత్బుల్లాపూర్ ప్రజలకు నిత్యం అందుబాటులో ఎమ్మెల్యే..

కుత్బుల్లాపూర్, మే 23 ( హంసకలం వార్త )



కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మరోసారి ప్రజా నాయకుడిగా తన ప్రత్యేకతను చాటుకున్నారు. కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం శుక్రవారం ప్రజల రాకపోకలతో సందడిగా మారింది. నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, సంక్షేమ సంఘాల సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున ఎమ్మెల్యేను కలిసి పలు ఆహ్వాన పత్రికలు, వినతిపత్రాలు అందజేశారు. ప్రజల సమస్యలను ఓపిగ్గా విన్న ఎమ్మెల్యే వివేకానంద్, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నియోజకవర్గ అభివృద్ధి, కాలనీల మౌలిక వసతులు, డ్రైనేజీ సమస్యలు, తాగునీటి ఇబ్బందులు, రోడ్ల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై పలువురు నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి సమస్యను ప్రాధాన్యతగా పరిగణిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే సూచించినట్లు సమాచారం. అభిమానులు, కార్యకర్తలతో ఆప్యాయంగా ముచ్చటించిన కేపీ వివేకానంద్, ప్రజల ఆశీస్సులు తనకు మరింత బాధ్యతను పెంచుతున్నాయని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండటం ప్రజాప్రతినిధి ధర్మమని, కుత్బుల్లాపూర్ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. దీంతో ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద రోజురోజుకూ ప్రజల రద్దీ పెరుగుతుండటం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. నియోజకవర్గ ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం నేరుగా ఎమ్మెల్యేను కలుసుకునే అవకాశం ఉండటంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల మధ్య ఉండే నాయకుడిగా వివేకానంద్ మరోసారి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారని స్థానిక నాయకులు అభిప్రాయం వ్యక్తం చేశారు..

## మియాపూర్ ప్రజల కోసం వైద్య సేవలు



మియాపూర్, మే 23 ( హంసకలం వార్త)

ఉచిత వైద్య శిబిరాలు సమాజ ఆరోగ్య అభివృద్ధికి ఎంతో ఉపయోగకరమైన సేవా కార్యక్రమాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వీ జగదీశ్వర్ గౌడ్ అన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని బీకే ఎంక్లేవ్ కాలనీలో యల్లమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, మమత ఆసుపత్రుల సంయుక్త సహకారంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో వీ జగదీశ్వర్ గౌడ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ట్రస్ట్ చైర్మన్ యల్లమంచి ఉదయ్ కిరణ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వీ జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యమే నిజమైన సంపద అని పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం ఉచిత వైద్య శిబిరాలు ఎంతో అవసరమని తెలిపారు. ఈ శిబిరం ద్వారా ప్రజలకు నిపుణులైన వైద్యుల సేవలు, ఆరోగ్య పరీక్షలు, ఉచిత మందులు అందించడం ఆనందంగా ఉందన్నారు. సమాజ సేవలో భాగంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ నాయకులు, కాలనీ వాసులు, ప్రజలు పాల్గొన్నారు..

## ఆస్తుల కంటే ఆరోగ్యమే అసలైన సంపద

-ఆరోగ్య శేరిలింగంపల్లే లక్ష్యం : ఆరెకపూడి గాంధీ..

-రూ.23 లక్షలతో బహిరంగ వ్యాయామశాల ప్రారంభం..

-పిల్లల ఆటస్థలం, నడక మార్గాలతో పార్క్ అభివృద్ధి..

-ఆస్తుల కంటే ఆరోగ్యమే గొప్ప సంపద..గాంధీ..



మియాపూర్, మే 23 ( హంసకలం వార్త )

మన భవిష్యత్ తరాలకు ఆస్తులు కాదు..మంచి ఆరోగ్యం, ప్రశాంత జీవితం అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రజా ఖాతాల కమిటీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని ఆరోగ్యవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని కృష్ణసాయి ఎన్క్లేవ్ కాలనీలో రూ.23 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన బహిరంగ వ్యాయామశాలను, చిన్నారుల ఆటపరికరాలను మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఆరెకపూడి గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీల్లో బహిరంగ వ్యాయామశాలలు ఏర్పాటు చేయడం ద్వారా పిల్లలు, యువత, వృద్ధులు ఆరోగ్యంపై దృష్టి సారించే అవకాశం కలుగుతుందని తెలిపారు. ప్రస్తుత జీవన విధానంలో ప్రతి ఒక్కరూ నిత్యం వ్యాయామం చేయడం అత్యవసరమని, ఆరోగ్యం బాగుంటే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని పేర్కొన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం అనే మాటను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని సూచించారు. కాలనీ ప్రజలు ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మియాపూర్ డివిజన్‌లోని పార్కులను ఆధునిక హంగులతో అభివృద్ధి చేసి, ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నడక మార్గాలు, రక్షణ కంచెలు, చిన్నారుల ఆట స్థలాలు, పచ్చదనం పెంపు వంటి పనులు చేపడుతున్నామని చెప్పారు. పార్కుల అభివృద్ధితో ప్రజలకు మానసిక ప్రశాంతతతో పాటు ఆరోగ్యకరమైన జీవనం అందుతుందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని మరిన్ని కాలనీల్లో బహిరంగ వ్యాయామశాలలు ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తామని ఆరెకపూడి గాంధీ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, మహిళలు, కాలనీ వాసులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు..

## కష్టకాలంలో అండగా డి.వి.జి ట్రస్ట్

ఆల్విన్ కాలనీ, మే 23 ( హంసకలం వార్త )



ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని పీజేఆర్ నగర్ కాలనీలో నివసిస్తున్న అర్జున్ (47) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతిచెందాడు. కుటుంబ పెద్దను కోల్పోయిన ఆ కుటుంబం విషాదంలో మునిగిపోయింది. స్థానికంగా ఈ ఘటన తీవ్ర విషాదాన్ని కలిగించింది. అర్జున్ మృతి విషయం తెలుసుకున్న ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ వెంటనే స్పందించారు. స్థానిక నాయకులను ఆదేశించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శింపజేసి వారి పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం డి.వి.జి ట్రస్ట్ ఆధ్వర్యంలో అర్జున్ కుటుంబానికి అంత్యక్రియల నిమిత్తం రూ.5,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా దొడ్ల వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు డి.వి.జి ట్రస్ట్ ఎల్లప్పుడూ సహాయం అందిస్తుందని తెలిపారు. స్థానిక ప్రజలు కూడా ముందుకు వచ్చి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యాదగిరి, రాజు, సాయి, కాలనీ వాసులు పాల్గొని అర్జున్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. దొడ్ల వెంకటేష్ గౌడ్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను స్థానికులు అభినందించారు..

# కార్మికుల కోసం జనసేన పోరాటం

-సెంట్రింగ్ కార్మికుల దీక్షకు ప్రేమ్ కుమార్ మద్దతు..

-31 రూపాయల రేటు పెంచాలంటూ ప్రభుత్వంపై ఫైర్..

-కార్మికులకు 20 లక్షల బీమా కల్పించాలని డిమాండ్..

-శ్రమజీవుల హక్కుల కోసం జనసేన పోరాటం కొనసాగుతుంది..

హైదరాబాద్, మే 23 ( హంసకలం వార్త )

రాష్ట్రంలో సెంట్రింగ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు రోజురోజుకూ తీవ్రమవుతున్న నేపథ్యంలో హైదరాబాద్ ఇందిరా పార్క్ ధర్నాచౌక్ వద్ద గత రెండు రోజులుగా కొనసాగుతున్న నిరాహార దీక్ష ఉద్రిక్తతకు దారితీసింది. గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ కార్మికులు, గుత్తేదారుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ఈ దీక్షకు కూకట్‌పల్లి నియోజకవర్గ జనసేన పార్టీ పోటీ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ సంఘీభావం ప్రకటించారు. ధర్నా ప్రదేశానికి చేరుకున్న ఆయన కార్మికులను పరామర్శించి వారి సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేస్తున్న 31 రూపాయల రేటు కార్మికులకు ఏమాత్రం సరిపోదని మండిపడ్డారు. పెరుగుతున్న ధరలు, కుటుంబ భారం, జీవన వ్యయాలను దృష్టిలో పెట్టుకుని ఆ రేటును వెంటనే 51 రూపాయలకు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేస్తున్న సెంట్రింగ్ కార్మికుల కుటుంబాలకు భరోసా కల్పించేలా ప్రస్తుతం ఉన్న 10 లక్షల బీమాను 20 లక్షలకు పెంచాలని కోరారు. కార్మికుల సంక్షేమానికి సంబంధించి ప్రభుత్వం ప్రకటించిన పథకాలు కాగితాలకే పరిమితమయ్యాయని విమర్శించిన ఆయన, శ్రమజీవుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు మరింత ఉధృతమయ్యే అవకాశముందని హెచ్చరించారు. సమాజ నిర్మాణంలో కార్మికుల పాత్ర అమూల్యమని,



అలాంటి కార్మికులను నిర్లక్ష్యం చేయడం తగదని అన్నారు. జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్, ఎప్పటిలాగే కార్మికుల పక్షాన నిలుస్తారని, తెలంగాణ రాష్ట్రంలోనూ జనసేన నాయకత్వం శ్రమజీవుల హక్కుల కోసం పోరాడుతూనే ఉంటుందని ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ స్పష్టం చేశారు. ధర్నా కార్యక్రమంలో కాకుమాను లక్ష్మణ్ రావు, కొల్లా శంకర్, బోగాది వెంకటేశ్వరరావు, వేముల మహేష్, పోలెబోయిన శ్రీనివాస్, మాధవ్ రావు, బడే విశ్వేశ్వర్ రావు, చిట్టిబాబు, జనసైనికులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, సెంట్రింగ్ కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు..

# పోలీసులకు చిక్కిన అంతర్రాష్ట్ర దొంగ

అమీన్‌పూర్, మే 23 ( హంసకలం వార్త )

అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వరుస చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర నిందితుడు మండల్లా శివ అలియాస్ ఎర్ర శివను అమీన్‌పూర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టు అనుమతితో స్వాధీనం చేసుకున్న సుమారు 45 తులాల బంగారు ఆభరణాలను బాధితులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం రామ్ నాయక్ తండాకు చెందిన మండల్లా శివ అలియాస్ ఎర్ర శివ ప్రస్తుతం మీర్‌పేట్ జిల్లగూడలోని భూపేష్ గుప్తా కాలనీలో నివసిస్తున్నాడు. చిన్ననాటి నుంచే కూలీ పనులు చేస్తూ జీవనం సాగించిన నిందితుడు, జల్సాలకు అలవాటు పడి సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో చోరీల బాట పట్టినట్లు విచారణలో వెల్లడైంది. మల్కాజిగిరి, సైబరాబాద్, నాగర్‌కర్నూల్ జిల్లాల పరిధిలోని పలు పోలీస్ స్టేషన్లలో నిందితుడిపై మొత్తం 24 కేసులు నమోదయ్యాయి. ఇందులో మల్కాజిగిరి కమిషనరేట్‌లో 12 కేసులు, సైబరాబాద్ కమిషనరేట్‌లో 3 కేసులు, నాగర్‌కర్నూల్ జిల్లాలో 9



కేసులు ఉన్నాయి. గతంలో హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులో చర్లపల్లి జైలులో శిక్ష అనుభవించి బెయిల్‌పై బయటకు వచ్చిన తర్వాత మళ్లీ చోరీలకు పాల్పడ్డాడు. ఈ ఏడాది ఏప్రిల్ రెండో వారంలో అమీన్‌పూర్, బందం కొమ్ము ప్రాంతాల్లో అర్ధరాత్రి వేళ తాళాలు వేసి ఉన్న ఇళ్లలోకి ఇనుప రాడ్లతో చొరబడి బీరువాల తాళాలు పగులగొట్టి డైమండ్, బంగారు ఆభరణాలను అపహరించినట్లు పోలీసులు గుర్తించారు. అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్



పరిధిలో మూడు చోరీలకు పాల్పడినట్లు దర్యాప్తులో తేలింది. మే 16న నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు, అతడి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న సుమారు 45 తులాల బంగారు ఆభరణాలను కోర్టు అనుమతితో మీడియా సమక్షంలో రామచంద్రపురం ఏసీపీ చై వెంకట యాదగిరి శ్రీనివాస్ కుమార్ బాధితులు వెంకటరమణ, భవానీ దంపతులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్ పి. నరేష్, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ జి. సత్యనారాయణతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు..

# కూకట్‌పల్లిలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

కూకట్‌పల్లి, మే 23 ( హంసకలం వార్త )

కూకట్‌పల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ భారీ కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గ సమన్వయకర్త రెడ్డి సతీష్ అరోరా పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో మే 25 సోమవారం ఉదయం 9 గంటలకు ఎన్‌కేఎన్ఆర్ గార్డెన్‌లో ఈ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని వెల్లడించారు. అలాగే ఎమ్మెల్సీలు కె నవీన్ కుమార్, శంభీపూర్ రాజు తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, రాష్ట్ర నాయకులు పాల్గొననున్నట్లు చెప్పారు. రాబోయే రాజకీయ పరిణామాల నేపథ్యంలో జరుగుతున్న ఈ సమావేశం కూకట్‌పల్లి రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది. నియోజకవర్గంలోని నాయకులు, మహిళా నాయకులు, యువజన విభాగాలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని రెడ్డి సతీష్ అరోరా కోరారు..



# కూకట్‌పల్లిలో కుంటుపడ్డ అభివృద్ధి..బీఆర్ఎస్ ఫైర్

-కూకట్‌పల్లి అభివృద్ధి కుంటుపాటు అంటూ బీఆర్ఎస్ ఫైర్..

-నీరు, రోడ్ల సమస్యలపై కాంగ్రెస్‌పై విమర్శలు..

-రియల్ ఎస్టేట్ పతనమైందన్న బీఆర్ఎస్ నేతలు..

-కేసీఆర్ పాలనకే ప్రజల మద్దతు..

కూకట్‌పల్లి, మే 23 ( హంసకలం వార్త )

కూకట్‌పల్లి డివిజన్‌లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడిచినా నియోజకవర్గంలో ఒక్క అభివృద్ధి పని కూడా ముందుకు సాగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ కాలంలో మంజూరైన పనులను కూడా ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యంగా నిలిపివేస్తోందని ఆరోపించారు. వేసవి కాలం రాగానే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ముందస్తు చర్యలు తీసుకొని ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూసేవారని, కానీ ప్రస్తుతం ప్రభుత్వం కనీస సమీక్షలు కూడా నిర్వహించడం లేదని ఎద్దేవా చేశారు. ప్రజలు మౌలిక సదుపాయాల లేమితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, చిన్న, మధ్య తరహా



పరిశ్రమలు వ్యాపారాలు లేక కుదేలవుతున్నాయని పేర్కొన్నారు. రియల్ ఎస్టేట్ రంగం పూర్తిగా పతనమై ప్రజల ఆర్థిక పరిస్థితులు దిగజారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అబద్ధపు హామీలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని విమర్శిస్తూ, కేసీఆర్ ప్రారంభించిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు తులం బంగారం ఇస్తామని చెప్పి ఇప్పటికీ అమలు చేయలేదన్నారు. రైతులకు రైతుబంధు సక్రమంగా అందడం లేదని మండిపడ్డారు. గతంలో కూకట్‌పల్లిలో వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని గుర్తు చేశారు. ఖాజాకుంట ఎస్‌టీపీ ప్లాంట్ నిర్మాణం, పార్కుల అభివృద్ధి, రహదారులు, మంచినీటి సౌకర్యాలు, నూతన డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు వంటి అనేక పనులు బీఆర్ఎస్ హయాంలో జరిగాయని వివరించారు. కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ తీసుకెళ్లి ప్రజలకు వివరించాలని, కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి ఎలా కుంటుపడిందో తెలియజేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఇప్పటికే ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై విసుగెత్తి కేసీఆర్ తిరిగి రావాలని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కోఆర్డినేటర్ సతీష్ అరోరా, మాజీ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షుడు సంతోష్, సెక్రటరీ ప్రభాకర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొట్టు విష్ణు, నాయకులు నామినేని తులసిరావు, అభిలాష్ రావు, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల పక్షాన ఎమ్మెల్యే మాధవరం

హైదరాబాద్, మే 23 ( హంసకలం వార్త )

సెంట్రింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు డిమాండ్ చేశారు. కార్మికుల ఆందోళన కార్యక్రమానికి హాజరైన ఆయన వారికి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో సెంట్రింగ్ కార్మికుల శ్రమ ఎంతో కీలకమైందని, పని సమయంలో ప్రమాదాలు జరిగితే వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేలా ప్రత్యేక బీమా సదుపాయం ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. నిర్మాణ సామాగ్రి దొంగతనాలను అరికట్టేందుకు కఠిన నిబంధనలు తీసుకురావాలని, దొంగిలించిన సామాగ్రిని ఎవరూ కొనకుండా



చట్టపరమైన చర్యలు ఉండాలని సూచించారు. సెంట్రింగ్ కార్మికులకు గుర్తింపు కార్డులు జారీ చేసి సంక్షేమ పథకాల పరిధిలోకి తీసుకురావాలని ఆయన పేర్కొన్నారు. కార్మికుల సమస్యలను బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, పార్టీ



కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు దృష్టికి తీసుకెళ్తామని, అవసరమైతే అసెంబ్లీలో కూడా ప్రస్తావిస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల ఆవేదనను అర్థం చేసుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే న్యాయం చేయాలని మాధవరం కృష్ణారావు డిమాండ్ చేశారు..

# భూదాన్ భూముల గందరగోళం రంగంలోకి ఈటెల





-భూదాన్ భూములపై బహిరంగంగా బాధితుల ఆవేదన..

-ఐడిపిఎల్ భూములంటూ నిర్మాణాలకు అడ్డంకులు..

-మోసగాళ్లపై చర్యలు తీసుకోవాలి..ఈటెల రాజేందర్..

-దళితులు, పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలంటూ డిమాండ్..

కూకట్‌పల్లి, మే 23 ( హంసకలం వార్త )

కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని ఆచార్య వినోబాభావే పురంలో భూదాన్ భూముల వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్ భూదాన్ బోర్డుకు సంబంధించిన స్థలాలను పరిశీలించి స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గ బీజేపీ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానికులు తమ గోడును ఎంపీ ఎదుట వినిపించారు. భూదాన్ బోర్డుకు చెందిన భూములను పేద, మధ్యతరగతి ప్రజలకు అమ్మి డబ్బులు వసూలు చేశారని, ఇప్పుడు అదే స్థలాలు ఐడిపిఎల్ భూములంటూ నిర్మాణాలను అడ్డుకుంటున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఐడిపిఎల్ సిబ్బంది, సీఐఎస్ఎఫ్ సిబ్బంది ఇళ్ల నిర్మాణాలను నిలిపివేస్తున్నారని పేర్కొన్నారు. డబ్బులు చెల్లించి మోసపోయామని బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు. దీనిపై స్పందించిన ఈటెల రాజేందర్ కూకట్‌పల్లిలో సుమారు 26.6 ఎకరాల భూదాన్ భూమిపై అనేక అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. పేదలు, మధ్యతరగతి కుటుంబాలకు స్థలాలు ఇస్తామని చెప్పి మోసం చేసిన వారిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక దళితులు, పేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ప్రభుత్వాలను కోరిన ఈటెల రాజేందర్, సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. న్యాయపరమైన చిక్కులు ఉన్నా ప్రభుత్వాలు జోక్యం చేసుకుని బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. అనంతరం వడ్డేపల్లి రాజేశ్వరరావు స్థానిక దళితులు, బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుతూ ఈటెల రాజేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, దళిత సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

# ధర్నాలో బీఆర్ఎస్ నేతల షో







-ఇందిరాపార్క్ ధర్నాలో బీఆర్ఎస్ మాజీ నేతల హాజరు..

-సంఘీభావమా..? లేక స్టేజ్ పాలిటిక్స్..

-ప్రతిపక్షంలోనూ రాజకీయ షో అంటూ విమర్శలు..

-కార్మిక సమస్యల కంటే నేతలే హైలైట్..

హైదరాబాద్, మే 23 ( హంసకలం వార్త )

ఇందిరాపార్క్ వద్ద గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ కాంట్రాక్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్మికుల భారీ ధర్నా ఒకవైపు సమస్యల వేదికగా నిలిస్తే, మరోవైపు రాజకీయ హాజరుల చుట్టూ చర్చను రేకెత్తించింది. సెంట్రింగ్ కార్మికులు, కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులు, పెరుగుతున్న మెటీరియల్ ధరలు, కనీస రేట్ల డిమాండ్ల నేపథ్యంలో ఈ ధర్నా నిర్వహించబడింది. అయితే ఈ ధర్నాలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌తో పాటు పలు డివిజన్ల మాజీ కార్పొరేటర్లు పాల్గొనడం ఇప్పుడు రాజకీయంగా విమర్శలకు కారణమవుతోంది. కార్మికుల సమస్యల పట్ల నిజమైన చిత్తశుద్ధితో సంఘీభావం తెలిపారా.? లేక కేవలం వేదికను ఉపయోగించుకుని హడావుడి హాజరుగా మారారా.? అనే ప్రశ్నలు బలంగా వినిపిస్తున్నాయి. స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చించబడుతున్నదాని ప్రకారం, ఇలాంటి ధర్నాల్లో మాజీ ప్రజాప్రతినిధుల హాజరు కొత్తేమీ కాకపోయినా, వారి ఉద్దేశ్యం పైనే ఇప్పుడు ప్రధానంగా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కార్మికుల సమస్యలను ప్రాధాన్యంగా తీసుకుని ప్రభుత్వంపై ఒత్తిడి తేవాల్సిన స్థాయిలో వారు స్పందించారా.? లేక కేవలం శాలువాలు, బొకేలు స్వీకరించి ఫోటోలకు పరిమితమయ్యారా..? అన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక ధర్నా వేదికపై నాయకుల హాజరు ఉన్నప్పటికీ, కార్మికుల కనీస వేతనాలు, పెన్షన్ పెంపు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు వంటి కీలక డిమాండ్లపై స్పష్టమైన కార్యాచరణ లేకపోవడం కూడా చర్చనీయాంశమైంది. కార్మికుల సమస్యలు తీవ్రంగా ఉన్న సమయంలో కేవలం సంఘీభావం ప్రకటించడం సరిపోతుందా లేదా విధానపరమైన పోరాటం అవసరమా అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. పదేళ్ల అధికార అనుభవం కలిగిన బీఆర్ఎస్ నాయకులు ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉన్న నేపథ్యంలో ఇలాంటి కార్యక్రమాల్లో వారి హాజరు రాజకీయ ప్రాధాన్యం పొందుతోంది. గతంలో అధికారంలో ఉన్నప్పుడు కార్మికుల సమస్యలపై తగిన స్థాయిలో స్పందించలేదన్న విమర్శలు ఎదుర్కొన్న నాయకులే ఇప్పుడు ధర్నాల్లో కనిపించడం పట్ల కొందరు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మొత్తంగా ఈ ధర్నా కార్మిక సమస్యల పరిష్కారానికి వేదికగా మారాల్సిన సందర్భంలో, రాజకీయ హాజరు అంశం ప్రధాన చర్చగా మారింది. నిజమైన కార్మిక మద్దతా లేక రాజకీయఅప్రయోజనాల కోసమేనా అన్న అనుమానాలు స్థానికంగా మరింత వేడెక్కుతున్నాయి.. కష్టాల్లో ఉన్న కార్మికుల వేదికలను కూడా రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం ఎంతవరకు సమంజసం అన్న ప్రశ్న ఇప్పుడు సామాజిక వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. ప్రజల కష్టాలు, కార్మికుల జీవన పోరాటాలు మధ్యలో కూడా రాజకీయ ప్రదర్శనలు కొనసాగుతుండటం పట్ల "సేవా రాజకీయమా.? లేక కేవలం అధికార ఆకాంక్షేనా.? అన్న విమర్శలు ఉధృవిస్తున్నాయి. ప్రజాసేవ పేరుతో జరుగుతున్న ప్రతి కార్యక్రమం నిజంగా ప్రజల కోసమేనా.? లేక రాజకీయ పునరాగమనం కోసం వాడుకుంటున్న వేదికలేనా..? అన్న చర్చ మరింత వేడెక్కుతోంది.

## మేడ్చల్ డిప్యూటీ కలెక్టర్ వంశీ మోహన్ అరెస్ట్

-రూ.100 కోట్లకు పైగా అక్రమ ఆస్తుల వెలికితీత



మే 23 ( హంసకలం వార్త)

మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా డిప్యూటీ కలెక్టర్ వంశీ మోహన్‌ను అవినీతి ఆరోపణల కేసులో ఏసీబీ అధికారులు శనివారం అరెస్ట్ చేశారు.భారీ స్థాయిలో అక్రమ ఆస్తులు వెలుగులోకి రావడంతో సోదాల అనంతరం ఆయనను రిమాండ్‌కు తరలించారు.ఈ ఘటన తెలంగాణ వ్యాప్తంగా సంచలనంగా మారింది.ఏసీబీ అధికారులు నిర్వహించిన విస్తృత సోదాల్లో వంశీ మోహన్‌కు సంబంధించిన భారీ ఆస్తులు బయటపడ్డాయి. మొత్తం 19 ఇళ్ల స్థలాలు, వనస్థలిపురంలో విలాసవంతమైన భవనం, మణికొండ,మజీద్‌బండ ప్రాంతాల్లో లగ్జరీ ఫ్లాట్లు ఉన్నట్లు గుర్తించారు. అలాగే ఇబ్రహీంపట్నం ప్రాంతంలో రెండు ఎకరాల ఫాంహౌస్ కూడా వెలుగులోకి వచ్చింది.సోదాల్లో బ్యాంక్ ఖాతాల్లో రూ.20 లక్షల డిపాజిట్లు,ఇంట్లో రూ.2.10 లక్షల నగదు,122 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు.రెండు ఖరీదైన కార్లను కూడా అధికారులు సీజ్ చేశారు.ఏసీబీ అంచనా ప్రకారం బయటపడిన ఆస్తుల బహిరంగ మార్కెట్ విలువ రూ.100 కోట్లకు పైమాటేనని సమాచారం.అయితే అధికారిక రిజిస్ట్రేషన్ విలువ మాత్రం రూ.6.22 కోట్లుగా నమోదైందని అధికారులు వెల్లడించారు.వంశీ మోహన్‌పై భూకుంభ కోణాలకు సంబంధించిన పలు ఆరోపణలు ఉన్నాయి.తన మేనమామ పేరిట 8 ఎకరాల ప్రభుత్వ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించినట్లు ఆరోపణలు ఉన్నాయి.ఆ భూమి డీల్‌కు బదులుగా 10 ప్లాట్లను గిఫ్ట్ డీడ్ రూపంలో తీసుకున్నట్లు ఏసీబీ అధికారులు అనుమానిస్తున్నారు. 2019 నుంచి 2023 వరకు శేరిలింగంపల్లి ఎమ్మార్వోగా పనిచేసిన సమయంలో పలు అక్రమాలకు పాల్పడినట్లు ఫిర్యాదులు నమోదయ్యాయి. ముఖ్యంగా సాహెబ్‌నగర్‌లో నాలుగు ప్లాట్లను అక్రమంగా రెగ్యులరైజ్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి.ఈ ఫిర్యాదుల ఆధారంగా ఏసీబీ అధికారులు సమగ్ర దర్యాప్తు చేపట్టారు.వంశీ మోహన్‌కు సన్నిహితంగా ఉన్న ఓ రియల్టర్ నివాసంలో కూడా అధికారులు సోదాలు నిర్వహించినట్లు సమాచారం. అక్కడ భూముల లావాదేవీలకు సంబంధించిన కీలకపత్రాలు లభించినట్లు తెలుస్తోంది.ఈ కేసులో మరికొందరు అధికారుల పాత్రపై కూడా ఏసీబీ అధికారులు దృష్టి సారించినట్లు సమాచారం. తెలంగాణలో అధికారుల అవినీతి వ్యవహారాలపై ఏసీబీ దూకుడు పెంచిన నేపథ్యంలో ఈ అరెస్ట్‌కు ప్రాధాన్యం ఏర్పడింది.ఈ కేసులో ఇంకా మరిన్ని సంచలన విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

## రెవెన్యూ ఇరిగేషన్ శాఖల సమన్వయంతో ప్రాజెక్టులు వేగవంతం

-సాగునీటి ప్రాజెక్టులకు భూ సేకరణ నిర్దేశిత గడువులో పూర్తి చేయాలి

-జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

మే 23 ( హంసకలం వార్త)




నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలో కొనసాగుతున్న ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల భూ సేకరణ ప్రక్రియను ప్రాజెక్టుల నిర్మాణాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులను ఆదేశించారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకంతో పాటు జిల్లాలో అమలవుతున్న ఇతర సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణపై శనివారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు, ప్రాజెక్టుల ఇంజినీర్లు, అదనపు కలెక్టర్ అమరేందర్ తో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతి ప్రాజెక్టు వారీగా వివరాలు ఆరా తీశారు. ఏ ప్రాజెక్టుకు ఎంత భూమి అవసరం, ఇప్పటివరకు ఎంత భూమి సేకరించబడింది, ఇంకా ఎంత భూమి సేకరించాల్సి ఉంది అనే అంశాలపై పూర్తి గణాంకాలతో నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. భూ సేకరణలో జరుగుతున్న ఆలస్యానికి గల కారణాలు, రైతుల అభ్యంతరాలు, కోర్టు కేసులు, పరిహారం చెల్లింపుల స్థితి వంటి అంశాలను కూడా సమగ్రంగా పరిశీలించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులు ఆలస్యం కాకుండా పనులు వేగవంతం చేయాలని, భూ సేకరణ అనేది ఏ ప్రాజెక్టు పురోగతికైనా కీలకమైన దశ అని, భూ సేకరణ దశలో చిన్నపాటి ఆలస్యం జరిగినా మొత్తం ప్రాజెక్టు పనులపై ప్రభావం పడే అవకాశం ఉందని కలెక్టర్ సూచించారు. అందుకే ప్రతి మండల స్థాయిలో ప్రత్యేక సమన్వయ బృందాలను ఏర్పాటు చేసి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని కలెక్టర్ ఆర్డీవో లకు సూచించారు. రైతులతో సానుకూల చర్చల ద్వారా భూసేకరణను వేగవంతం చేయాలని, వారికి చట్టప్రకారం న్యాయమైన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని, భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను సూచించారు. ప్రాజెక్టుల పురోగతిని మరింత వేగవంతం చేయడానికి రెవెన్యూ మరియు ఇరిగేషన్ శాఖల మధ్య సమన్వయం అత్యంత అవసరమని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి వారం పురోగతి నివేదికలు సమర్పించాలని, పెండింగ్ సమస్యలను స్థాయివారీగా సమీక్షించి పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.సాగునీటి ప్రాజెక్టులు పూర్తయితే జిల్లాలో వేలాది ఎకరాల భూమికి సాగునీరు అందుబాటులోకి వచ్చి వ్యవసాయ ఉత్పాదకత పెరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ శాఖల ఎస్సీలు పార్థసారథి, సత్యనారాయణ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అరుణ, ఆర్డీవోలు సురేష్ బాబు , జనార్దన్ రెడ్డి, యాదగిరి బన్సీలాల్ తాహసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.


# బిజినెస్

## దిగివచ్చిన పసిడి... ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు ఇలా..



మూడు రోజులుగా పరుగులు పెట్టిన బంగారం ధరలకు ఇవాళ బ్రేక్ పడింది. దేశీయ బులియన్ మార్కెట్లో పసిడి ధర స్వల్పంగా తగ్గింది. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితులు, డాలర్‌తో పోలిస్తే రూపాయి బలహీనపడటం వంటి కారణాలతో ధరలు రికార్డు స్థాయిలోనే కొనసాగుతున్నాయి. ఇటీవల కేంద్ర ప్రభుత్వం బంగారంపై దిగుమతి సుంకాన్ని 15 శాతానికి పెంచడమే ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా విశ్లేషకులు చెబుతున్నారు. ఈ నిర్ణయంతో పసిడి ధరల్లో తీవ్రమైన ఒడిదొడుకులు కనిపిస్తున్నాయి. మూడు రోజుల లాభాల తర్వాత, నిన్న ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో ధరలు కాస్త తగ్గినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో శనివారం ఉదయం హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,59,480గా నమోదైంది. 22 క్యారెట్ల పసిడి ధర రూ. 1,46,190 వద్ద ఉంది. విజయవాడలోనూ ఇవే ధరలు కొనసాగుతున్నాయి. అయితే, ఇతర ప్రధాన నగరాలతో పోలిస్తే చెన్నైలో అత్యధికంగా 10 గ్రాముల పసిడి ధర రూ.1,61,230గా ఉండగా, ఢిల్లీలో రూ. 1,59,630గా ఉంది. వెండి ధరల్లోనూ నగరాల మధ్య వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తోంది. హైదరాబాద్, చెన్నైలో కిలో వెండి ధర రూ.2,95,100 ఉండగా, ముంబై, ఢిల్లీ మార్కెట్లలో రూ.2,84,900 వద్ద ట్రేడ్ అవుతోంది. మొత్తం మీద, దిగుమతి సుంకం పెంపు ప్రభావంతో దేశీయ మార్కెట్లో బంగారం, వెండి ధరలు అధిక స్థాయిలోనే అస్థిరంగా కొనసాగుతున్నాయి.

## హోమ్ లోన్ ఈఎంఐ కట్టలేదా? మీ క్రెడిట్ స్కోర్ దెబ్బతినకుండా ఉండేందుకు ఐదు మార్గాలు!



గృహ రుణం (హోమ్ లోన్) తీసుకున్న తర్వాత ఏదైనా కారణం వల్ల నెలవారీ ఈఎంఐ చెల్లించలేకపోతే చాలామంది తీవ్రమైన ఒత్తిడికి గురవుతుంటారు. ఖర్చులు పెరగడం, ఉద్యోగంలో అనిశ్చితి, వైద్య ఖర్చులు వంటి కారణాల వల్ల ఇలాంటి సమస్యలు ఎదురవుతుంటాయి. అయితే ఇలాంటి సమయంలో కంగారు పడకుండా బ్యాంక్ అధికారులతో మాట్లాడితే సమస్య నుంచి బయటపడొచ్చు. ఒకవేళ ఈఎంఐ చెల్లించడం ఆలస్యమైతే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో చూద్దాం..

**ఈఎంఐ కట్టకపోతే?**

హోమ్ లోన్ ఈఎంఐ సకాలంలో చెల్లించకపోతే ఆలస్య రుసుము కట్టాల్సి వస్తుంది. దీనివల్ల క్రెడిట్ స్కోర్ దెబ్బతింటుంది. భవిష్యత్తులో మళ్లీ లోన్‌లు పొందడం కష్టమవుతుంది. ఒకవేళ వరుసగా ఈఎంఐలు కట్టకుండా డిఫాల్టర్లుగా మారితే.. బ్యాంకులు చట్టపరమైన చర్యలు తీసుకుని ఇంటిని స్వాధీనం చేసుకునే అవకాశం ఉంటుంది.

**లోన్ రీస్ట్రక్చరింగ్**

ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పుడు బ్యాంకులను సంప్రదిస్తే వారు లోన్ రీస్ట్రక్చరింగ్ ఆప్షన్లను పరిశీలిస్తారు. మీ ఆర్థిక పరిస్థితిని బట్టి లోన్ కాలపరిమితిని పెంచడం లేదా కొన్ని నెలల పాటు ఈఎంఐ చెల్లింపుల నుంచి తాత్కాలిక మినహాయింపు ఇవ్వడం వంటివి చేస్తారు. దీనివల్ల నెలవారీ ఈఎంఐ భారం కొంతవరకు తగ్గుతుంది.

**అనవసర ఖర్చులకు బ్రేక్**

ఈఎంఐలు ఉన్నప్పుడు విలాసాలకు, అనవసరమైన కొనుగోళ్లకు దూరంగా ఉండాలి. చేతిలో ఉన్న డబ్బుతో మొదట పెండింగ్ ఈఎంఐలను క్లియర్ చేయడానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ఆలస్యం చేసే కొద్దీ అప్పుల భారం పెరిగిపోయి క్రెడిట్ ప్రొఫైల్ దెబ్బతింటుంది.

**అప్పు తీర్చడానికి మరో అప్పు వద్దు**

పెండింగ్ ఈఎంఐలను కట్టడానికి ఎక్కువ వడ్డీకి పర్సనల్ లోన్లు తీసుకోవడం లేదా బయట వ్యక్తుల దగ్గర అప్పులు చేయడం అస్సలు మంచిది కాదు. ఇది మిమ్మల్ని మరింత అప్పుల ఊబిలోకి నెట్టేస్తుంది. మానసిక ఒత్తిడిని పెంచి తిరిగి చెల్లించే సామర్థ్యాన్ని దెబ్బతీస్తుంది.

**నిపుణుల సలహా తీసుకోవడం మేలు**

పరిస్థితి చేదాటిపోతోందని అనిపిస్తే మంచి ఫైనాన్షియల్ అడ్వైజర్ సలహా తీసుకోవాలి. మీ ప్రస్తుత ఆదాయం, అప్పులను బట్టి వారు ఒక మంచి ప్రణాళికను అందిస్తారు. బ్యాంకులతో ఎలా మాట్లాడాలి, దీర్ఘకాలికంగా అప్పుల నుంచి ఎలా బయటపడాలనే విషయాలపై వారు సరైన మార్గదర్శకత్వం చేస్తారు.

## సీఎస్‌కే కొత్త కోచ్‌గా ఎంఎస్ ధోనీ? అశ్విన్ సంచలన పోస్ట్!



చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) జట్టు హెడ్ కోచ్ పదవి నుంచి స్టీఫెన్ ఫ్లెమింగ్‌ను తొలగిస్తే కొత్త కోచ్ కోసం ఎక్కడో వెతకాల్సిన అవసరం లేదని టీమిండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అన్నాడు. ఆ జట్టు మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీయే ఆ పదవికి అర్హుడని అశ్విన్ 'ఎక్స్' వేదికగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఐదుసార్లు జట్టుకు ట్రోఫీలు అందించిన ధోనీ ప్రస్తుతం సీఎస్‌కే డగౌట్‌లోనే ఉన్నాడని అశ్విన్ గుర్తుచేశాడు.

**ఫ్లెమింగ్ పై ఎందుకు విమర్శలు?**

స్టీఫెన్ ఫ్లెమింగ్ 2009 నుంచి సీఎస్‌కే కోచ్‌గా కొనసాగుతున్నాడు. అతడి హయాంలో జట్టు ఎన్నో విజయాలు సాధించింది. అయినా గత మూడు సీజన్లుగా చెన్నై కనీసం ప్లేఆఫ్స్‌కు కూడా అర్హత సాధించలేకపోయింది. ప్రస్తుత ఆధునిక టీ20 క్రికెట్‌లో మిగతా జట్లు భారీ హిట్టింగ్‌పై దృష్టి పెడుతుంటే చెన్నై మాత్రం ఇంకా పాత పద్ధతులనే నమ్ముకుంటోందనే విమర్శలు వస్తున్నాయి. రాహుల్ త్రిపాఠీ, దీపక్ హుడా, డారిల్ మిచెల్ వంటి ఆటగాళ్లు ఈ పాత శైలి వల్ల రాణించలేకపోయారు.

**జట్టులో లోపాలు**

ప్రస్తుత సీజన్‌లో కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ ఫామ్ కోల్పోవడం టాప్ ఆర్డర్ బ్యాటింగ్‌ను దెబ్బతీసింది. బౌలింగ్‌లో నూర్ అహ్మద్, అన్షుల్ కాంబోజ్ రాణిస్తున్నప్పటికీ.. ఒక సమర్థమైన బౌలింగ్ యూనిట్‌గా చెన్నై రాణించలేకపోతోంది. గుజరాత్ టైటాన్స్, లక్నో సూపర్ జెయింట్స్ తరహాలో చెన్నై బౌలింగ్‌లో ఆ పదును కనిపించడం లేదు. గాయం కారణంగా ధోనీ ఈ సీజన్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఆడకపోవడంతో నాయకత్వ లోపం స్పష్టంగా తెలిసొచ్చింది.

## మహిళాభిమానికి క్షమాపణ చెప్పిన రోహిత్ శర్మ.. కారణమిదే!




టీమిండియా స్టార్ క్రికెటర్ రోహిత్ శర్మ తన మంచి మనసును మరోసారి చాటుకున్నాడు. తనను కలవలేకపోయానని ఓ యువతి కన్నీళ్లు పెట్టుకున్న వీడియో చూసి చలించిపోయాడు. ఆమెకు క్షమాపణ చెబుతూ ప్రత్యేకంగా ఓ వీడియో సందేశాన్ని పంపించాడు. వచ్చేసారి కోల్‌కతా వచ్చినప్పుడు తప్పకుండా కలుస్తానని హామీ ఇచ్చి ఆమెను ఆనందంలో ముంచెత్తాడు.

**అసలేం జరిగిందంటే..!**

ఇటీవల కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా ముంబయి ఇండియన్స్, కేకేఆర్ జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్ కోసం వచ్చిన రోహిత్‌ను చూసేందుకు జినియా అనే యువతి స్టేడియానికి వచ్చింది. తన అభిమాన క్రికెటర్‌ను కలవడం తన కల అని, గంటల తరబడి ఎదురుచూసింది. డ్రెస్సింగ్ రూమ్ నుంచి ఆటగాళ్లు బయటకు వస్తున్నప్పుడు, రోహిత్‌ను చూసి 'రోహిత్ భాయ్' అంటూ గట్టిగా అరిచింది. అయితే, అక్కడి అభిమానుల శబ్దంలో ఆమె పిలుపును రోహిత్ గమనించకుండా వెళ్లిపోయాడు. దీంతో తీవ్ర నిరాశకు గురైన ఆ యువతి కన్నీరు పెట్టుకుంది. ఈ దృశ్యాన్ని ఆమె బంధువు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా, అది కాస్తా వైరల్ అయింది. ఈ వీడియో రోహిత్ శర్మ దృష్టికి చేరింది. అభిమాని బాధను చూసి హిట్ మ్యాన్ స్పందించాడు. "హాయ్ జినియా! నిన్ను ఈడెన్ గార్డెన్స్‌లో కలవలేకపోయినందుకు క్షమించు. నీ వీడియో చూశాక నాకూ బాధేసింది. కొన్నిసార్లు అభిమానుల రద్దీలో ఎవరు పిలుస్తున్నారో గుర్తించడం కష్టమవుతుంది. వచ్చేసారి కోల్‌కతా వచ్చినప్పుడు నిన్ను తప్పకుండా కలుస్తాను" అని చెబుతూ ఓ వీడియో విడుదల చేశాడు. ఈ వీడియో చూసిన జినియా ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి.

# స్పోర్ట్స్

## కృనాల్ వింత బౌలింగ్‌కు కావ్య మారన్ షాక్.. స్టాండ్స్‌లో ఆమె రియాక్షన్ వైరల్!




రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) ఆల్ రౌండర్ కృనాల్ పాండ్యా తన వినూత్న బౌలింగ్‌తో ప్రత్యర్థులకు సవాల్ విసురుతున్నాడు. ముఖ్యంగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో అతని బౌలింగ్ శైలి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఈ యాక్షన్‌ను చూసిన ఎస్ఆర్‌హెచ్ యజమాని కావ్య మారన్ సైతం అయోమయానికి గురయ్యారు. ఐపీఎల్‌లో భాగంగా జరిగిన ఈ మ్యాచ్‌లో కృనాల్ పాండ్యా తన సైడ్-ఆర్మ్ యాక్షన్‌తో పాటు బ్యాటర్లపై బౌన్సర్లను కూడా అస్త్రంగా ప్రయోగించాడు. ఇది చూసిన కావ్య మారన్, అసలు ఇలాంటి బౌలింగ్‌కు అనుమతి ఉందా? అన్నట్లుగా హావభావాలు ప్రదర్శించారు. స్టాండ్స్‌లో కూర్చున్న ఆమె ముఖ కవళికలు కెమెరాలో స్పష్టంగా రికార్డ్ అయ్యాయి. దీంతో ఆమె రియాక్షన్ సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. ఆ సమయంలో ఆమె పక్కన టాలీవుడ్ సీనియర్ హీరో విక్టరీ వెంకటేశ్ ఉన్నారు. అయితే, కావ్య మారన్‌ను అంతగా ఆశ్చర్యపరిచిన కృనాల్ బౌలింగ్ పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. తాను వేసిన రెండు ఓవర్లలో 24 పరుగులు ఇచ్చి కేవలం ఒక వికెట్ మాత్రమే తీశాడు. అనంతరం బ్యాటింగ్‌లో 31 బంతుల్లో 41 పరుగులు చేసి ఫర్వాలేదనిపించాడు. అయినప్పటికీ ఈ మ్యాచ్‌లో ఆర్‌సీబీ 55 పరుగుల భారీ తేడాతో ఓటమి పాలైంది. కృనాల్ ప్రదర్శన జట్టును గెలిపించలేకపోయింది.

హంస కలం వార్త HAMSA KALAM VARTA
ఆదివారం 24 మే 2026

# ఆ సమయంలో చాలా సిగ్గుగా అనిపించింది

- ఐదో తరగతి చదువుతున్నప్పుడు డ్రామాలో ఆడవేషం వేయించారన్న నాగార్జున
- అందరూ ఎగతాళి చేయడంతో సిగ్గనిపించిందని వెల్లడి
- సినిమాల్లో నటించమని తన అన్నయ్య సూచన చేశాడన్న నాగార్జున



తాను ఐదో తరగతి చదువుతున్నప్పుడు ఒక డ్రామాలో ఆడవేషం వేయించారని, అప్పుడు అందరూ తనను చాలా ఎగతాళి చేశారని ప్రముఖ సినీ నటుడు నాగార్జున అన్నారు. ఆ సమయంలో తనకు చాలా సిగ్గుగా అనిపించిందని పేర్కొన్నారు. నాగార్జున సినిమా పరిశ్రమకు వచ్చి 40 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన తన సినీ ప్రయాణం గురించి చెప్పుకొచ్చారు. తాను నటుడిని అవుతాననే చెప్పే ఆనవాళ్లు తన బాల్యంలో ఏవీ లేవని అన్నారు. తనకు మూడు సంవత్సరాలు ఉన్నప్పుడే హైదరాబాద్‌కు వచ్చేశామని తెలిపారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో చదివానని, కానీ స్టార్ హీరో నాగశ్వరరావు కొడుకును అనే ప్రత్యేక శ్రద్ధ ఏమీ ఉండేది కాదని అన్నారు. తాను సగటు విద్యార్థిని అని, చదువులో మొదటి ఇరవై స్థానాల్లో ఉండేవాడినని అన్నారు. ఆడవేషం వేసినప్పుడు తనను ఎగతాళి చేయడంతో తాను మళ్లీ డ్రామాల జోలికి వెళ్లలేదని పేర్కొన్నారు. సుడిగుండాలు చిత్రంలో 30 సెకన్లు మాత్రమే కనిపించే చిన్న పాత్ర వేశానని, తాను మేకప్ వేసుకోవడం అదే మొదటిసారి అన్నారు. చదువు పూర్తయ్యాక ఏడాదిన్నర పాటు అమెరికాలో ఉన్నానని అన్నారు. అక్కడే సెటిల్ అవుదామని ఎప్పుడూ అనుకోలేదని వెల్లడించారు. ఇక్కడకు వచ్చి ఏదైనా వ్యాపారం చేద్దామనుకున్నానని, అప్పుడు ఏదైనా లైసెన్స్ కావాలంటే ఏడాది సమయం పట్టేదని అన్నారు. అందుకే తాను ఫిల్మ్ ప్రొడక్షన్‌లోకి దిగానని చెప్పారు. అప్పుడే తన అన్నయ్య వెంకట్, తనను సినిమాల్లో నటించమని సూచించాడని పేర్కొన్నారు. అప్పటి వరకు తనకు నటన మీద ఆసక్తి లేదని, కానీ అన్నయ్య చెప్పాక ఆలోచించానని తెలిపారు. 1986లో మొదటి చిత్రం 'విక్రమ్' విడుదలైందని, అది మంచి విజయం సాధించినప్పటికీ విమర్శలు వచ్చాయని అన్నారు. తనను నాన్న గారితో పోల్చి చూడటంతో విమర్శలు వచ్చాయని అన్నారు. సినిమాల్లో జీన్స్ వేసుకోవడం తనతోనే ప్రారంభమైందని గుర్తు చేసుకున్నారు.

# జిమ్‌లో శ్రియా రెడ్డి 'కర్రసాము' విన్యాసాలు..



నటి శ్రియా రెడ్డి తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా షేర్ చేసిన కొన్ని వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కాలికి గాయమై కట్టు కట్టి ఉన్నప్పటికీ ఆమె జిమ్‌లో కఠినమైన కసరత్తులు చేస్తూ కనిపించారు. కేవలం వర్కవుట్లు మాత్రమే కాకుండా ఆమె చేసిన కర్రసాము విన్యాసాలు అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాయి.

## ఒంటి చేత్తో విన్యాసాలు

శ్రియా రెడ్డి మొత్తం మూడు వీడియోలను అభిమానులతో పంచుకున్నారు. మొదటి దాంట్లో ఒంటి చేత్తో కర్రను గిరగిరా తిప్పుతూ అదరగొట్టారు. రెండో వీడియోలో రెండు చేతులతో రెండు కర్రలను చాలా వేగంగా తిప్పుతూ తన నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఇక మూడో దాంట్లో జిమ్‌లో కఠినమైన వర్కవుట్లు చేస్తూ కనిపించారు. ఆమె ఫిట్‌నెస్ పట్ల నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

## హనుమాన్ కాంప్లెక్స్ మెసేజ్


ఈ వీడియోలతో పాటు శ్రియా రెడ్డి పెట్టిన పోస్ట్ నెటిజన్లను ఆలోచింపజేస్తోంది. "మళ్లీ ఫామ్‌లోకి రావడానికి ఒక్కో అడుగు వేస్తున్నా. మన బలాన్ని మనం మర్చిపోవడాన్నే 'హనుమాన్ కాంప్లెక్స్' అంటారు. జీవితం తిరిగి గుర్తుచేసే వరకు మన శక్తి ఏంటో మనకు తెలియదు. సముద్రాన్ని దాటే ముందు హనుమంతుడికి కూడా జాంబవంతుడు ఆయన శక్తిని గుర్తుచేయాల్సి వచ్చింది. మనల్ని మనం నమ్మడానికి కొన్నిసార్లు మనకూ ఒకరు కావాలి" అని ఆమె రాసుకొచ్చారు.

# ఆస్ట్రేలియాలో 'పెద్ది' రికార్డు... తొలి చిత్రంగా అరుదైన ఘనత




గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో వస్తున్న 'పెద్ది' చిత్రం విడుదల విషయంలో సరికొత్త రికార్డు సృష్టించింది. ఈ రూరల్ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుండగా, ఓవర్సీస్‌లో ముఖ్యంగా ఆస్ట్రేలియాలో భారీ స్థాయిలో రిలీజ్ అవుతోంది. అక్కడి ప్రముఖ సినిమా చైన్ 'హోయిట్స్'కు సంబంధించిన అన్ని లొకేషన్లలోనూ విడుదల కానున్న తొలి చిత్రంగా 'పెద్ది' చరిత్ర సృష్టించనుంది. ఈ చిత్రాన్ని ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఫిజీ దేశాల్లో ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ ప్రత్యంగిరా ఓవర్సీస్ పంపిణీ చేస్తోంది. సాధారణంగా పెద్ద సినిమాలు కూడా ఎంపిక చేసిన కొన్ని హోయిట్స్ థియేటర్లలో మాత్రమే విడుదలవుతాయి. కానీ, 'పెద్ది' చిత్రాన్ని ఆస్ట్రేలియాలోని అన్ని హోయిట్స్ సెంటర్లలోనూ ప్రదర్శించనుండటం విశేషం. ఇది తెలుగు సినిమాకు అంతర్జాతీయంగా పెరుగుతున్న ఆదరణకు నిదర్శనమని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఈ సినిమాలో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ భారీ విడుదల ప్రకటనతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.

# ఆ వైరల్ వీడియో, ఫొటోలు నావి కావు.. బాధ్యుల పై లీగల్ యాక్షన్ తీసుకుంటా




సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న తన బికినీ ఫోటోషూట్ చిత్రాల పై నటి రుక్మిణి వసంత్ తీవ్రంగా స్పందించారు. ఆ చిత్రాలు పూర్తిగా నకిలీవని, ఏఐ టెక్నాలజీతో సృష్టించినవని ఆమె స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. కొన్ని రోజులుగా, గ్రీన్ బికినీ ధరించి స్విమ్మింగ్ పూల్‌లోకి వెళుతున్నట్లుగా ఉన్న ఓ మహిళ ఫొటోలు, వీడియో క్లిప్‌లు ఆన్‌లైన్‌లో విపరీతంగా చక్కర్లు కొడుతున్నాయి. చాలామంది నెటిజన్లు ఇది రుక్మిణి వసంత్ 'మొదటి బికినీ షూట్' అంటూ ప్రచారం చేయడంతో గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో రుక్మిణి తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ ద్వారా దీనిపై పూర్తి వివరణ ఇచ్చారు. "నా పేరుతో సర్క్యులేట్ అవుతున్న కొన్ని ఏఐ-జనరేటెడ్ చిత్రాలు నా బృందం దృష్టికి వచ్చాయి. ఆ చిత్రాలు పూర్తిగా ఫేక్, కల్పితం అని నేను స్పష్టంగా చెప్పాలనుకుంటున్నాను. వాటికి నాకు ఎలాంటి సంబంధం లేదు" అని ఆమె తన పోస్టులో పేర్కొన్నారు. ఇలాంటి నకిలీ కంటెంట్‌ను సృష్టించి, వ్యాప్తి చేయడం అత్యంత బాధ్యతారాహిత్యమని, ఇది వ్యక్తిగత గోప్యతా హక్కులను తీవ్రంగా ఉల్లంఘించడమేనని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఫేక్ చిత్రాలను రూపొందించి, వ్యాప్తి చేసిన వారిపై తన బృందం సైబర్ క్రైమ్, చట్టపరమైన చర్యలు ప్రారంభిస్తుందని రుక్మిణి తెలిపారు. ఇటువంటి తప్పుడు సమాచారాన్ని ప్రోత్సహించవద్దని, ఆ కంటెంట్‌ను ఎవరూ షేర్ చేయవద్దని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ వివాదం పక్కన పెడితే, రుక్మిణి వసంత్ తన కెరీర్ పై పూర్తి దృష్టి సారించారు. ఆమె ప్రస్తుతం పాన్ ఇండియా స్టార్ యశ్‌తో కలిసి 'టాక్సిక్' చిత్రంలో నటిస్తున్నారు. దీనితో పాటు యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ హీరోగా చేస్తున్న 'డ్రాగన్' సినిమాలో కూడా ఆమె హీరోయిన్. ఇలా కెరీర్‌లో ప్రస్తుతం ఆమె వరుస పాన్ ఇండియా ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు.

# 'సమవర్తి'గా వస్తున్న సత్యదేవ్.. ఆకట్టుకుంటున్న ఇంటెన్స్ ఫస్ట్ లుక్

విలక్షణమైన పాత్రలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటుడు సత్యదేవ్, ఇప్పుడు పూర్తిస్థాయి యాక్షన్ అవతారంలోకి మారుతున్నారు. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న కొత్త చిత్రానికి 'సమవర్తి' అనే టైటిల్‌ను శుక్రవారం అధికారికంగా ప్రకటించారు. దర్శకుడు అజయ్ నాగ్ వి తెరకెక్కిస్తున్న ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను కూడా విడుదల చేశారు. ఫస్ట్ లుక్ పోస్టర్ సినిమాపై అంచనాలను పెంచుతోంది. ఇందులో సత్యదేవ్ హెడ్‌ఫోన్స్ పెట్టుకుని ప్రశాంతంగా సంగీతం వింటుండగా, ఆయనపై గొడ్డళ్లు, కత్తులతో కొందరు వ్యక్తులు దాడికి వస్తున్నట్లు చూపించారు. పోస్టర్ బ్యాక్‌గ్రౌండ్‌లో పులి బొమ్మ ఉండటం మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ పోస్టర్‌ను షేర్ చేస్తూ, "ఈసారి ఇచ్చిన మాట నిలబెట్టుకుంటాం!!" అని సత్యదేవ్ తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు. నాయకుడిగా సత్యదేవ్‌కు ఇది 16వ చిత్రం. 'ఎకోలాజికల్ యాక్షన్ థ్రిల్లర్' అనే కొత్త జానర్‌లో ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు చిత్ర యూనిట్ తెలిపింది. ప్రకృతి నేపథ్యంలో సాగే యాక్షన్, పర్యావరణ సంఘర్షణల కలయికతో ఈ చిత్రం ఉండనుంది. రుద్ర పిక్చర్స్, పంచభూత ప్రొడక్షన్స్ బ్యానర్లపై శివచరణ్ రెడ్డి జక్కిడి, శశిధర్ రెడ్డి పడమటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ భాషల్లోనూ 'సమవర్తి'ని గ్రాండ్‌గా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రంలో దిలీష్ పోతన్, రాజీవ్ కనకాల, గానవి లక్ష్మణ్, రవీంద్ర విజయ్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. సింజిత్ యర్రమిల్లి సంగీతం అందిస్తుండగా, హర్ష మల్లికార్జున్, దేవ్ దీప్ గాంధీకుండు సినిమాటోగ్రఫీ బాధ్యతలు చేపట్టారు.



Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037,
Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449